
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	మంగళవారం	బుధవారం
కర్నూలు	6:35	4:56
నంద్యాల	6:31	4:56

చట్ట ప్రకారం న్యాయం చేస్తాం : ఎస్పీ విక్రాంత్

పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 94 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేటలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 94 ఫిర్యాదులు వచ్చాయి.

- క్రిష్ణవర్ణ పొదుపు సంఘంలో రూ.8 లక్షలు తీసుకున్నావ. ప్రతినెలా కంతులు కట్టించుకున్నారు. పొదుపు సంఘంలోని లీడర్లయిన సభ్యులు బ్యాంకుకు డబ్బులు కట్టకుండా మోసం చేశారని, బ్యాంకు నుంచి నోటీసులు వచ్చాయని కర్నూలు నిర్మల్‌నగర్‌కు చెందిన పల్లవి, రషీద, విజయలక్ష్మి, ఇతర సభ్యులు ఫిర్యాదు చేశారు.
- తన పెద్ద కుమారుడు ఇల్లు రాసి ఇవ్వాలని ఇంటి, కుళాయి పన్నులు కట్టకుండా ఇంటి పట్టాలు తీసుకెళ్లి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు కొత్తపేటకు చెందిన సుంకులమ్మ ఫిర్యాదు చేశారు.
- ఇరిగేషన్ డిపార్టుమెంటులో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలుకు చెందిన సూర్యమాధవరావు రూ.6.50 లక్షలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.
- వాటర్ ప్లాంట్ ఫిట్టింగ్ చేస్తానని చెప్పి రూ.లక్ష తీసుకుని కర్నూలుకు చెందిన వారిష వాటర్ టెక్స్ మున్నా మోసం చేశాడని కర్నూలు మద్దూరునగర్‌కు చెందిన రామ్మూర్తి ఫిర్యాదు చేశారు.
- కోడుమూరు వెంకటగిరిలో ఉన్న రెండున్నర ఎకరాల పొలాన్ని రంగమ్మ డబ్బులు తీసుకుని అమ్ముకుంది. మనుమడు గిడ్డయ్య ఆమెను రిజిస్టర్ చేయనీయకుండా మోసం చేస్తున్నాడని కర్నూలుకు చెందిన అంజినమ్మ ఫిర్యాదు చేశారు.
- పట్టాభి రామయ్య కుటుంబ అవసరాల కోసం డబ్బులు తీసుకొని ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు సంతోష్‌నగర్‌కు చెందిన రహీంబీ ఫిర్యాదు చేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులు న్యాయం చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, సీఐలు పాల్గొన్నారు.

బెట్టింగులకు దూరంగా ఉండాలి

కర్నూలు క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యువత క్రికెట్ బెట్టింగులకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఐపీఎల్ టీ-20 క్రికెట్ మ్యాచ్‌లను ఆసరాగా తీసుకుని అమాయక ప్రజలను మోసగించేందుకు క్రికెట్ బెట్టింగ్ ముఠాలు పని చేస్తున్నాయన్నారు. అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లా పోలీసులు ఇటువంటి క్రికెట్ బెట్టింగ్ ముఠాలను అణిచివేసేందుకు ప్రజలు సహకరించాలని, సమాచారం స్థానిక పోలీసులకు గానీ, లేదా డయల్ 100, 112కు అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు.



రెండు ప్రభుత్వాలదీ ఒకే నిర్లక్ష్యం

కర్ణాటక రాష్ట్రం మోకా సమీపంలో హగరి నదిపై నిర్మించిన తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) అక్విడక్ట్ పిల్లరు 2022 అక్టోబరు 10న వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అక్విడక్ట్ దిగువన ఇనుప గడ్డర్లతో స్లాబ్ కూలిపోకుండా తాత్కాలిక మరమ్మతులు చేశారు. దాదాపు రూ.28 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారు. రెండున్నరేళ్లు గడిచినా శాశ్వత మరమ్మతులు చేపట్టలేదు.

- 2022లో వరదకు కొట్టుకుపోయిన ఎల్లెల్సీ అక్విడక్ట్ పిల్లర్
- తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టిన గత వైసీపీ ప్రభుత్వం
- ఆ తర్వాత వచ్చిన కూటమి పాలనలోనూ అదే నిర్లక్ష్యం
- మళ్లీ వరదొస్తే అడ్డు పెట్టిన చెక్కలు కొట్టుకుపోయే ప్రమాదం
- పశ్చిమ పల్లెల్లో 1.51 లక్షల ఎకరాల సాగు, 194 గ్రామాలకు తాగు నీటిపై ప్రభావం

రెండున్నరేళ్ల వెనక ..కర్ణాటకాంధ్ర సరిహద్దులో ప్రవహించే హగరి నదికి వరద వచ్చింది. మోకా సమీపంలో నదిపై నిర్మించిన తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) అక్విడక్ట్ పిల్లరు కొట్టుకుపోయింది. కర్నూలు పశ్చిమ పల్లెలకు నీటి సరఫరా ఆగిపోయింది. అప్పటి వైసీపీ పాలకులు అక్విడక్ట్ స్లాబ్ కూలిపోకుండా ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేసి తాత్కాలిక మరమ్మతులతో సరిపుచ్చారు. శాశ్వత మరమ్మతులను పట్టించుకోలేదు. ఆ తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా ఆ వైపు ఆలోచించలేదు. ఈ వేసవిలోనైనా కొట్టుకుపోయిన పిల్లరును పునర్నిర్మించడానికి కనీసం ప్రతిపాదనలు కూడా తయారు చేయలేదు. మళ్లీ వరదొస్తే అడ్డంగా పెట్టిన చెక్కలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. 1.43 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకమవుతుంది. ఈ స్థితిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.


కర్నూలు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశ్చిమ ప్రాంతం పల్లెలకు తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) ఒక్కటే ఆధారం.. జిల్లాల విభజన తరువాత కర్నూలు జిల్లాలో మిగిలిన ఏకైక అతి పెద్ద సాగునీటి వనరు ఇదే. ఎల్లెల్సీ కాలువ 1953-57 మధ్యలో నిర్మించారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా మోకా సమీపంలో కాలువ 121 కి.మీల వద్ద హగరి నదిపై 700 మీటర్లు పొడవు, 56 పిల్లర్లతో అక్విడక్ట్ నిర్మించారు. ఒక్కో పిల్లరు మధ్య 30 అడుగులు దూరం (గ్యాప్) ఉంది. పిల్లరు మధ్య భాగంలో కాలువ, రోడ్డు స్లాబులు జాయింట్ (అనుసంధానం) చేశారు. 72 ఏళ్ల క్రితం నిర్మించిన అక్విడక్ట్ పిల్లర్లు మరమ్మతులకు వచ్చాయి. 2022 అక్టోబరు 9, 10వ తేదీల్లో కర్ణాటక రాష్ట్రం, అనంతపురం జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు హగరి నదికి వరద పోటెత్తింది. వరద ఉధృతికి ఎల్లెల్సీ అక్విడక్ట్ 9వ పిల్లరు ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయింది. స్లాబులు కూలిపోయే ప్రమాదం ఉండడంతో తుంగభద్ర డ్యాం నుంచి నీటి సరఫరా నిలిపివేశారు. జిల్లాలో సాగు, తాగునీరు ప్రశ్నార్థకంగా మారడంతో.. అప్పటి అధికార వైసీపీ ముఖ్య నాయకులు, నాటి వైసీపీ మంత్రి గుమ్మనూరు జయరాం (ప్రస్తుతం గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే), వైసీపీ ఎమ్మెల్యేలు వై. సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్న కేశవరెడ్డి హడావుడి చేశారు. తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి.. ఆ వెంటనే శాశ్వత మరమ్మతులు చేపడుతామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ప్రతిపాదనలు కూడా తయారు చేయలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి నాయకులైనా అక్విడక్ట్ పునఃనిర్మాణం గురించి పట్టించుకోలేదు. ఎల్లెల్సీ సీసీ లైనింగ్ పనుల్లో వాటాలపై పెట్టిన శ్రద్ధ రైతుల జలప్రయోజనాలపై లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



హగరి అక్విడక్ట్ డిటైల్స్

మళ్లీ వరదొస్తే..!

జిల్లాలో ఆలూరు, ఆదోని, మంత్రాయలం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్‌లో 43,519 ఎకరాలు, రబీలో 1,07,615 ఎకరాలు కలిపి 1,51,134 ఎకరాలు స్థిరీకరించిన ఆయకట్టు ఉంది. తుంగభద్ర డ్యాం నుంచి 24 టీఎంసీల నీటివాటా ఉంది. ఆంధ్ర సరిహద్దు ఆదోని మండలం ఆనవాళ్ల సమీపంలో 251 కి.మీల వద్ద 650-700 క్యూసెక్కుల నీరు ఇవ్వాలి. ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ పట్టణాలతో పాటు పది మండలాల్లో 194 గ్రామాలకు తాగు, ఆయకట్టుకు సాగునీరు అందించే టీబీపీ ఎల్లెల్సీకి ప్రమాదం పొంచి ఉంది. జూన్ నుంచి హగరికి వరదలు మొదలవుతాయి. భారీ వరద రాకముందే అక్విడక్ట్ పిల్లర్‌ను జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు పునఃనిర్మించాలని రైతులు కోరుతున్నారు.



ఎల్లెల్సీ

- హగరి నదిపై ఎల్లెల్సీ అక్విడక్ట్ నిర్మించి 72 ఏళ్లు దాటింది. మరమ్మతులు చేస్తే ప్రజాధనం వృథా అవుతుంది. పాత అక్విడక్ట్ పక్కనే హగరిపై 700 మీటర్లు పొడవు నూతన అక్విడక్ట్ నిర్మిస్తే మరో 50-60 ఏళ్ల వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదని టీబీపీ బోర్డు ఇంజనీర్లు అంటున్నారు. దీనికి దామాషా ప్రకారం నిధులు ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు ఆమోదం తెలపాలి. రెండున్నరేళ్లు గడిచినా సర్వే కూడా టీబీపీ బోర్డు చేయలేదని తెలుస్తున్నది.

నూతన అక్విడక్ట్ నిర్మాణమే ఉత్తమం

హగరి నదిపై టీబీపీ ఎల్లెల్సీ అక్విడక్ట్ నిర్మించి 72 ఏళ్లు కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. దాని పక్కనే కొత్తగా మరో అక్విడక్ట్ నిర్మిస్తే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఆ దిశగా సర్వే, డీపీఆర్ తయారు చేయించాల్సి ఉంది. తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీ వాటా 24 టీఎంసీలు ఉంది.. ఎల్లెల్సీ పరిధిలో కర్నూలు జిల్లాలో 1.51 లక్షల ఆయకట్టు, 194 గ్రామాలకు తాగునీరు అందుతోంది.

- నారాయణ నాయక్, ఇన్‌చార్జి ఎస్ఈ, తుంగభద్ర బోర్డు, హొస్పేట

దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జాయింట్ కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి రీఓపెన్ కేసుల మీద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కర్నూలు వద్ద 55, కర్నూలు ఆర్డీవో వద్ద 20, పత్తికొండ ఆర్డీవో వద్ద 9, ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 4, రీ ఓపెన్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో పరిష్కారం చేసిన అర్జీలను ఆడిట్ చేయడంలో పురోగతి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రెవెన్యూ గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులలో పెండింగ్‌లో ఉన్న వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

- సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి కర్నూలు ఆర్డీవో వద్ద 18, ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 16, పత్తికొండ ఆర్డీవో 12, డీపీవో 3, డీఎస్‌వో 2, ట్రైబల్ వెల్ఫేర్, డీఎంహెచ్‌వో, డీఈవో, హౌసింగ్ పీడీల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్న వాటిని బీయాండ్ ఎస్ఎల్ఏలో వెళ్లకుండా పరిష్కరించాలన్నారు. రీసర్వేకి సంబంధించి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్‌ట్రూతింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.



బాధితుడి సమస్య వింటున్న జాయింట్ కలెక్టర్ బి.నవ్య

ప్రొఫెషన్ కోర్సుల్లో నైపుణ్యం సాధించాలి: ప్రొఫెషన్ కోర్సుల్లో నైపుణ్యం సాధించి భవిష్యత్తులో స్థిర పడాలని జాయింట్ కలెక్రట్ డా.బి. నవ్య విభిన్న ప్రతిభా వంతుల విద్యార్థులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 13 ల్యాప్‌టాప్‌లు, 12 సెల్‌ఫోన్లను జాయింట్ కలెక్టర్ విభిన్న ప్రతిభావంతులకు అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర భ్రుత్వం పాలిటెక్నిక్, డిగ్రీ తదితర ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న అర్హులైన విభిన్న ప్రతిభావంతుల కోసం 13 ల్యాప్‌టాప్‌లను అందజేశారు. అదేవిధంగా ఇంటర్ కోర్సు పూర్తి చేసిన 12 మంది విభిన్న ప్రతిభావంతులకు సెల్‌ఫోన్లను అందజేశారు. సమావేశంలో డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే సీమ వెనుకబాటుతనం

- 'పందికోన'కు రూ.250 కోట్లు కేటాయించాలి
- రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

పత్తికొండ టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా పాలకులు అవలంబించిన నిర్లక్ష్యం వల్లనే రాయలసీమ వెనుకబాటు తనానికి గురైందని, ఇప్పటికైనా ప్రజలు మేల్కొని పార్టీలకతీతంగా సాగు, తాగునీరుకై ఉద్యమించాలని రాయలసీమ సాగునీటి సంఘం సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి పందికోన రిజర్వాయర్ ఆయకట్టు సాధన సమితి ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం దాకా భారీ ర్యాలీ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పందికోన రిజర్వాయర్ ఆయకట్టు సాధన సమితి అధ్యక్షుడు శేషాద్రి రెడ్డి అధ్యక్షత జరిగిన ధర్నాలో ముఖ్య అతిథిగా హాజరైన బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ పందికోన రిజర్వాయరు 14 ఏళ్లు కావస్తున్నా కళ్లెదుటే పక్క జిల్లాలకు ఏటా కాలువ ద్వారా పారుతున్నా ఆ నీరును రైతులు వాడుకునే అవకాశం లేకపోవడం విచారకరమన్నారు. పందికోన కుడి, ఎడుమ కాలువలను పూర్తి చేస్తే 62 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, అలాగే అనేక గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కేవలం కుడి కాలువకు మాత్రమే నీరు ఇవ్వడం ద్వారా కేవలం 10వేల హెక్టార్లు సాగులోకి వచ్చిందని, అదే ఎడమకాలువ పూర్తయితే 50వేల పైచిలుకు నీరు సాధించవచ్చన్నారు. రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకుడు అరుణ్ మాట్లాడుతూ పందికోన రిజర్వాయరు కింద ఆయకట్టుకు కింద పత్తికొండ, తుగ్గలి, దేవనకొండ, ఆస్పరి, గోనెగండ్ల మండలాల పంట పొలాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు రూ.250 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన పత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి రాజాసాహెబ్, నియోజకవర్గ అధ్యక్షుడు సురేంద్ర కుమార్, రైతు సంఘాల నాయకులు ఆదినారాయణ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మహిళా రైతు నాయకురాలు మునెమ్మ, స్థానిక రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ నవ్య



ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ

కర్నూలు హాస్పిటల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య సూచించారు. ప్రపంచ క్షయ నివారణ దినం పురస్కరించుకుని కలెక్టరేట్ ఎదుట ర్యాలీని జేసీ, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, జిల్లా టీబీ ఆఫీసర్ డాక్టర్ ఎల్. భాస్కర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ క్షయను ముందుగానే గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడాల న్నారు. మధుమేహం, రక్తపోటు, పొగ, మద్యం తాగేవారు, కాలుష్య ప్రాంతాల్లో పని చేసేవారు గతంలో వ్యాధికి గురైన వారిని గుర్తించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి, జిల్లా క్షయ నివారణ రిటైర్డు అధికారి డాక్టర్ మోక్షేశ్వరుడు, ఎన్‌జీవో నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కోడుమూరు వార్డెన్ సస్పెండ్

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ కె.రాముడును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రంజిత్ బాషా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 11వ తేదీన హాస్టల్‌లో 7, 8 తరగతుల విద్యార్థులపై పదవ తరగతి చదువుతున్న విద్యార్థి దాడి చేసిన సంఘటన వైరల్‌గా మారింది. ఈ సంఘటనపై సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మీదేవి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో పలు అంశాలు వెలుగు చూసినట్లు తెలిపారు. వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని విద్యార్థుల తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి హాస్టల్ వార్డెన్ రాముడును బాధ్యుడిని చేస్తూ కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 29న ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నందమూరి తారకరామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ 42 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా అనునిత్యం ప్రజల కోసం పాటు పడింది ఒక్క తెలుగుదేశం పార్టీయేనని అన్నారు.

పాల సేకరణ ధర పెంపు

విజయ డెయిరీ చైర్మన్



నంద్యాల రూరల్ మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పాల సేకరణ ధర పెంచినట్లు కర్నూలు జిల్లా మిల్క్ యూనియన్ చైర్మన్ ఎస్వీ జగన్మోహన్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలు.. కర్నూలు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకర సమితి తీసుకున్న నిర్ణయం మేరకు మార్చి 16 నుంచి పాలసేకరణకు ధర పెంచినట్లు తెలిపారు. పాల సేకరణ ధరను కేజీ వెన్న (కేజీ ఫ్యాట్) ఆధారంగా గేదె పాలకు కిలో రూ. 740 నుంచి రూ. 760కు పెంచామని ఆవుపాల ధరను కిలోకు రూపాయి చొప్పున పెంచినట్లు పేర్కొన్నారు. పెరిగిన పాల సేకరణ ధరలు కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప జిల్లాలో పాల రైతులందరికీ వర్తిస్తాయని వెల్లడించారు.

ఆదోని మెడికల్ కాలేజీ పనుల పరిశీలన

- మెడికల్ కాలేజీ, ఆసుపత్రికి రూ.312 కోట్ల నిధులు
- 60 శాతం కూడా పూర్తిగాని పనులు
- ప్రభుత్వం చొరవ తీసుకొని తక్షణమే పూర్తి చేయాలి
- నాబార్డు ఏపీ రీజినల్ జనరల్ మేనేజరు కేవీఎస్ ప్రసాద్



పరిశీలిస్తున్న నాబార్డు జనరల్ మేనేజరు కేవీఎస్ ప్రసాద్ తదితరులు

కర్నూలు/ఆదోని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆదోని మెడికల్ కాలేజీ, ఆసుపత్రి నిర్మాణం అసంపూర్తి పనులపై నాబార్డు ఏపీ రీజినల్ మేనేజరు కేవీఎస్ ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 60 శాతం కూడా పూర్తి చేయాలేదని పేర్కొన్నారు. నాబార్డు ఉమ్మడి కర్నూలు జిల్లా అసిస్టెంట్ జనరల్ మేనేజరు (ఏజీఎం) ఎం సుబ్బారెడ్డి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఎం.కేశవయ్యతో కలిసి సోమవారం ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు పరిశీలించారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, కాలేజీ, మెడికల్ బ్లాక్, మెడిసిన్ విద్యార్థుల హాస్టళ్ల భవనాల పనులను ఆయన పరిశీలించారు. ఏఏ భవనాలు ఏ స్థాయిలో ఉన్నాయో సమగ్రంగా తనిఖీ చేయడమే కాకుండా వాటి ఫొటోలు కూడా తీసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం కేవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఆదోని మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణం కోసం ఆర్ఐడీఎఫ్ కింద రూ.312 కోట్లు మంజూరు చేశామని అన్నారు. అనివార్య కారణాలు వల్ల ఆగిపోయాయని తెలిపారు. నాబార్డు రూ.312 కోట్లు మంజూరు చేస్తే ఇప్పటికే రూ.141 కోట్లు విడుదల చేసిందని, కాంట్రాక్ట్ సంస్థ రూ.80 కోట్ల మేర పనులు చేసిందని వివరించారు. ఆదోని ప్రాంతం ఎంతో వెనకబడి ఉందని, ఇక్కడి ప్రజలకు మెడికల్ కాలేజీ, బోధనాస్పత్రి ఎంతో అవసరమని, ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని పనులు పూర్తి చేయడంతో పాటు వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వెంటనే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మంచి టైం..!

సిటీ లైఫ్

- ఆకట్టుకుంటున్న విభిన్న గోడ గడియారాలు
- పాత కాలం వాల్‌క్లాక్‌లపై మోజు
- నగరవాసుల్లో ఇంటీరియల్స్‌పై మక్కువ

చిన్న ఇళ్లు అయినా సరే అందంగా ఉంచుకోవడం మన చేతుల్లోనే ఉంటుంది. ఇటీవలి కాలంలో ఇళ్ల నిర్మాణాలు, ఇంట్లో ఇంటీరియల్స్ డెకరేషన్స్ డిజైన్లపై ప్రజల్లో మోజు పెరుగుతోంది. ఎంత ఖర్చయినా పర్వాలేదు.. ఇల్లు బంగారంలా మెరిసిపోవాలంటూ ఇంటి యజమానులు శ్రద్ధ చూపుతున్నారు. ఇంట్లో కొత్తగా అందంగా ఉండే వస్తువులను ఏర్పాటు చేసుకుంటున్నారు. కప్‌బోర్డ్స్, ఫాల్ సీలింగ్స్, మార్బుల్స్, డోర్ల డిజైన్లు వాల్ టైల్స్, పెయింటింగ్స్ ఇలా ఏ డిజైన్‌లో కూడా రాజీ పడడం లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే అక్కడక్కడ అలంకరించేందుకు ప్రత్యేకించి బొమ్మలను కొనుగోలు చేస్తున్నారు. వీటితో పాటు ఈ క్రమంలో గోడ గడియారాలను కూడా ప్రత్యేకంగా ఉండే వాటిని ఎంచుకుంటున్నారు. కొందరు పెద్దవిగా, ప్లెయిన్‌గా ఉండే వాల్ క్లాక్‌లను ఇష్టపడుతుండగా.. మరికొందరు తమ హోదాను, దర్పాన్ని తెలిపేలాంటి గోడ గడియారాలపై మక్కువ చూపుతున్నారు. ఇలాంటి వారి కోసం ఆకట్టుకునే లాంటి ఇంటి అందాన్ని పెంచేటటువంటి గోడ గడియారాలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. నగరంలో పెద్ద పెద్ద హోటళ్లు, షాపింగ్ మాల్స్‌లోనూ ఇలాంటి గడియారాలు ఆకర్షిస్తున్నాయి. వాటిలో కొన్నింటిని చూద్దాం..


-కర్నూలు క్రైం (ఆంధ్రజ్యోతి)











- **డిజిటల్ క్లాక్:** ఎల్ఈడీ వెలుగును వెదజల్లే ఈ క్లాక్స్‌ను ఇంటికి కొత్త అందాన్నిస్తాయి. వెలుగు తక్కువ ఉండే గదుల్లో కూడా ఇవి చాలా బాగుంటాయి. ఇందులో ఉండే రేడియో అలారం ఉదయాన్నే నిద్రలేపుతుంది.
- **త్రీడీ మోడల్:** త్రీడి గడియారాల్లో బొమ్మలు, పెయింటింగ్స్, స్టిక్కర్స్ ఒక ప్యానెల్‌లో కాకుండా రెండు, మూడు ప్యానెల్స్‌లో ఉంటున్నాయి. ఒకదానిలో మాత్రం వాల్ క్లాక్ ఉంటుంది. స్పైడర్‌మెన్, జంతువులు, పండ్లు, కూరగాయల బొమ్మలున్న త్రీడీ వాల్ క్లాక్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.
- **డిజైన్ గడియారాలు :** రంగు రాళ్లతో చేసిన డిజైన్ గడియారాలు వెండి లోహంతో తయారు చేసిన గడియారాలు ఇంటికి ప్రత్యేక అందాన్ని తీసుకువస్తున్నాయి. మధ్యలో గడియారం ఉండి చుట్టూ ఫ్రేమ్‌లు ఉండటం, ఇంట్లో సభ్యుల ఫొటోలు, ఫ్యామిలీ ఫొటోలు, పూలు, బొమ్మలు, కోయబొమ్మలు, అమర్చుకునే విధంగా ఈ గడియారాలు ఉంటున్నాయి. సూర్యుడు, చంద్రుడు, నెమళ్ల ఆకారాల్లో కూడా ఈ గడియారాలు మార్కెట్‌లో ఆకట్టుకుంటున్నాయి.
- **ఓల్డ్ ఈజ్ గోల్డ్ :** ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటూ పాత తరం నాటి గడియారాలే కొత్త ట్రెండ్‌గా నగరవాసులు ఫాలో అవుతున్నారు. పెద్ద గడియారం అడుగు నుంచి రెండు వైపులా వేలాడుతూ ఊగిసలాడే పెండ్యులమ్ నగరవాసులను ఆకర్షిస్తున్నాయి. పెండ్యులమ్ కదలికతో వచ్చే స్వీట్ సౌండ్ ఈ మోడల్‌లో మాత్రమే ఉండే ప్రత్యేక లక్షణం కావడంతో నేటి తరం వారు ఈ గడియారాలను కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ గడియారాలు నగరంలోని ప్రముఖ వాచ్ దుకాణాల్లో ఆన్‌లైన్ మార్కెట్‌లో రూ.1000 నుంచి రూ.20వేల వరకు లభిస్తు న్నాయి.
- **ఎంపీ-3 అలారం క్లాక్:** ఎంపీ-3 కలిగిన డిజిటల్ అలారం గడియారాలు నవ్యత రాన్ని ఆకట్టుకుం టున్నాయి. సరిక త్తపాటలతో ఉద యాన్నే ఇవి మ నలను మేలుకొలుపుతాయి.

గోనెగండ్ల సెక్షన్‌కు వచ్చిన ఎల్లెల్సీ నీరంతా కోడుమూరుకే..

ఆయకట్టు భూములకు 79 క్యూసెక్కులు

జీడీపీ నుంచి 40, ఎల్లెల్సీ నుంచి 39 క్యూసెక్కులు

గోనెగండ్ల, మార్చి24(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీకి నీటి విడుదల మూడు రోజులుగా తగ్గింది. గోనెగండ్ల సెక్షన్‌కు సోమవారం 39 క్యూసెక్కుల నీరు మాత్రమే చేరుతోంది. దీంతో గోనెగండ్ల సెక్షన్‌కు చేరిన 39 క్యూసెక్కుల నీటినంతటిని కోడుమూరు ఎల్లెల్సీ ఆయకట్టు రైతులకు అధికారులు విడుదల చేస్తున్నారు. దీంతో గోనెగండ్ల ఆయకట్టు భూములకు నీటి విడుదలను నిలిపివేశారు. కోడుమూరుకు ఎల్లెల్సీ నుంచి విడుదలైన 39 క్యూసెక్కులు ఎంతమాత్రం సరిపోకపోవడంతో గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి కుడి కాలువ ద్వారా మరో 40 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. ఎల్లెల్సీ నీరు 39 క్యూసెక్కులు, గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి 40 క్యూసెక్కుల నీరు కోడుమూరు చేరుతోంది. ఈ నీటి విడుదల మరో రెండు మూడు రోజులు కొనసాగవచ్చునని తెలుస్తోంది. గోనెగండ్ల సెక్షన్ కింద అరకొరగా మిగిలిన పంటలు కోత కోసుకోవడం కోసం మరోసారి నీటి విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. తాగునీటి కోసం కూడా నీరు విడుదల చేయాల్సిన అవసరం ఉంది. వేసవి కాలం దృష్ట్యా గోనెగండ్ల, అలువాల ఎస్ఎస్ ట్యాంకులు, కుంటలు, వాగులను నీటితో నింపుకోవాల్సి ఉంటుందని ప్రజలు తెలుపుతున్నారు. కొన్ని రోజులుగా సాగు నీరు కోడుమూరు సెక్షన్‌కు అందకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. ప్రస్తుతం ఎల్లెల్సీ, జీడీపీ నీరు 79 క్యూసెక్కులు విడుదల కావడంతో కోడుమూరు ఆయకట్టు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు మాత్రం మార్చి నెల చివరి వరకు ఎల్లెల్సీ నీటి విడుదల ఉంటుందని తెలుపుతున్నారు. ఈ రబీ సీజన్ లో గోనెగండ్ల సెక్షన్‌కు 175 క్యూసెక్కుల నీరు విడుదల కావాల్సి ఉంది. అయితే సోమవారం 39 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలైంది.



గాజులదిన్నె ప్రాజెక్టు కుడి కాలువ నుంచి కోడుమూరుకు వెళుతున్న నీరు

రుణాల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్



బెల్డోన గ్రామంలో రైతు నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్న బ్యాంకు అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా సహకార బ్యాంకు ద్వారా దీర్ఘకాలిక, కర్షక జ్యోతి పథకం కింద రుణాలు తీసుకున్న రైతుల నుంచి బకాయిల వసూలు కోసం బ్యాంకు అధికారులు స్పెషల్ డ్రైవ్ సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో విజయకుమార్‌తో పాటు జనరల్ మేనేజర్ రామాంజనేయులు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్, నాగిరెడ్డి, ఏజీఎంలు త్రినాథ్ రెడ్డి, తదితరులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రుణాలను రికవరీ చేస్తున్నారు. ఇందులో భాగంగా డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి, ఏజీఎం త్రినాథ్ రెడ్డి తదితరులు సోమవారం ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండలంలోని బెల్డోన గ్రామంలో నాగముని రుద్రయ్య, చంద్రశేఖర్ రెడ్డి, ఖాజామొహిద్దీన్ తదితర రైతుల నుంచి రుణబకాయిలు సకాలంలో జమ కానందున వారి సమక్షంలో టీవీలను, మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకునేందుకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో విలేకరుల సమావేశంలో డీజీఎం ఉమామహేశ్వరరెడ్డ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకుతో పాటు 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో దీర్ఘకాలిక రుణాలు, కర్షక జ్యోతి పథకం కింద రైతుల నుంచి రూ.350 కోట్ల దాకా రుణబకాయిలు వసూళ్లు కావాల్సి ఉందని స్పష్టం చేశారు. 2,500 మంది రైతులు పది సంవత్సరాలుగా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించడం లేదని, ప్రస్తుతం వారికి చెందిన చరాస్తులను మాత్రమే జప్తు చేస్తున్నామనీ, త్వరలోనే స్థిరాస్తులను కూడా స్వాధీనం చేసుకుంటామన్నారు.

శ్రీమఠం కృషి అభినందనీయం

కొనియాడిన మఠాధిపతులు

మంత్రాలయం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): దేశానికి ఎంతో మంది వేద విద్వాంసులను శ్రీమఠం వేద పాఠశాల అందిస్తోందని పలువురు మఠాధిపతులు అన్నారు. సోమవారం శ్రీమఠం ఊంజల మండపంలో ఏర్పాటు చేసిన శ్రీమన్ న్యాయసుధ మంగళ మహోత్సవం మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో ఘనంగా ముగిసింది. ఉదయం నుంచి ఆయా మఠాల పీఠాధిపతులు వేరువేరుగా సంస్థాన పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. అనంతరం వ్యాసరాజ మఠం, శ్రీపాద రాజమఠం, పేజావర్ మఠం, మళిమార్ మఠం, భీమనకట్టె మఠం పీఠాధిపతులు విద్యశ్రీష తీర్థులు, సుజయనిధి తీర్థులు, విశ్వప్రసన్న తీర్థులు, విద్యాధీష తీర్థులు, విశ్వధీష తీర్థులు మాట్లాడారు. మంత్రాలయం శ్రీగురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠంలో అత్యంత ప్రాముఖ్యమైన శ్రీమన్ న్యాయసుధ విద్యను పూర్తి చేయించి దేశానికి అవసరమైన పండితులను అందించిందన్నారు. రాఘవేంద్ర స్వామి మఠం దినదినాభివృద్ధితో పాటు గోసంరక్షణ, ఉచిత వైద్యం, సంస్కృత విద్య, భక్తులకు మెరుగైన సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంలో సఫలీకృతమైందని కొనియాడారు. అనంతరం మఠాధిపతులను సత్కరించారు. కార్యక్రమంలో రాజాఎస్ గిరిరాజాచార్, రాజాఎస్ అప్రమేయ ఆచార్, బండాచార్, ఎస్ఎన్ వెంకటేష్ ఆచార్, సుధీంద్ర ఆచార్, ఆనందతీర్థఆచార్, గౌతమాచార్, సురీంద్రాచర్, వాదిరాజాచార్, రమనారావ్, ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్‌జోషి, శ్రీపతిఆచార్, సురేష్‌కోణాపూర్, ఐపీ నరసింహమూర్తి, ఏఈ బద్రినాథ్, వ్యాసరాజాచార్, వివిధ రాష్ట్రాల పండితులు, భజన మండలి మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీమన్ న్యాయసుధ మంగళ మహోత్సవానికి హారతులు ఇచ్చి ముగింపు పలుకుతున్న పీఠాధిపతులు



వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన విద్వాంసులు, పండితులు

అడవిలో అన్నదాతలు

- ప్రతిరోజూ వేలాది మంది భక్తుల ఆకలి తీరుస్తున్న వైనం
- 20 ఏళ్లుగా శ్రీశైల మల్లికార్జున మల్టీపర్పస్ ట్రస్టు సేవలు



ఆత్మకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రానికి తరలివెళ్లే కన్నడిగులకు దాతల సేవలు కొనసాగుతున్నాయి. ప్రత్యేకించి మహారాష్ట్రలోని కొల్లాపూర్ జిల్లా ఇచ్చిలుకరించి ప్రాంతానికి చెందిన శ్రీశైల మల్లికార్జున మల్టీ పర్పస్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏటా నిర్వహిస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలోని నాగలూటి వీరభద్రస్వామి ఆలయ సమీపంలో 20 ఏళ్ల నుంచి వేలాది మంది కన్నడిగుల ఆకలి తీరుస్తున్నారు. ఈ అన్నదాన సేవకై ప్రతిఏటా సుమారు రూ.కోటి వరకు వరకు ఖర్చు కానుంది. ఇందులో 20 శాతం వరకు దాతల నుంచి విరాళాలు అందుతున్నప్పటికీ మిగిలిన 80 శాతం ఖర్చులను ట్రస్టు సభ్యులే భరాయిస్తున్నారు. ఉగాది మహోత్సవాల నేపథ్యంలో శ్రీశైలానికి కాలినడకన తరలివచ్చే భక్తులకు ఎలాంటి లోటు రాని వ్వకూడదన్నదే తమ సంకల్పమని ట్రస్టు సభ్యులు చెబుతున్నారు.

250 మంది వలంటీర్లతో నిరంతర సేవలు

శ్రీశైల మల్లికార్జున మల్టీ పర్పస్ ట్రస్టు ఆధ్వర్యంలో నాగలూటి వీరభద్రాలయం సమీపంలో కొనసాగుతున్న అన్నదాన కేంద్రంలో సుమారు 250 మంది కూలీలు అన్నదాన సేవలో భాగస్వాములయ్యారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కొంత మంది భక్తులు ముందుగానే వందల కి.మీ. దూరం కాలినడకన నాగలూటి చేరుకుని అక్కడి అన్నదాన కేంద్రంలో కొన్ని రోజులు సేవలు చేసి శ్రీశైలానికి వెళ్తుంటారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు నిరంతరం వలంటరీలు ఎవరి పనులు వారు చేస్తుంటారు. అన్నం, సాంబార్, మజ్జిగ, పాయసం తదితర ఆహార పదార్థాలతో పాటు జొన్న రొట్టెలను తయారీ చేసి భక్తులకు వడ్డిస్తున్నారు. వారం రోజులకు సరిపడేలా 50 టన్నుల బియ్యం, క్వింటాళ్ల కొద్ది బెల్లం, నూనె తదితర నిత్యావసర వస్తువులను నిల్వ ఉంచారు. ఆత్మకూరు సంత మార్కెట్ నుంచి ప్రతిరోజూ కూరగాయాలు కొనుగోలు చేస్తున్నారు. ఇదిలావుంటే శ్రీశైల పాదయాత్రికులకు అన్నదాన సేవలు ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణంలో శ్రీశైల మల్లికార్జున మల్టీ పర్పస్ ట్రస్టు ఆధ్వర్యంలో నల్లమల చెంచులకు సేవలు అందిస్తున్నారు. అన్నదాన నిర్వహణ అనంతరం మిగిలిన సామగ్రిని స్థానిక చెంచులకు పంపిణీ చేస్తారు. అలాగే ప్రతిఏటా దుస్తులను కూడా అందజేస్తారు.



భారీ వంట పాత్రలో పాయసాన్ని తయారు చేస్తున్న దృశ్యం



జొన్నరొట్టెలను తయారు చేస్తున్న మహిళలు

20 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నాం



25 ఏళ్ల కిందట శ్రీశైలానికి కాలినడకన వచ్చాను. అప్పట్లో ఆకలికి తట్టుకోలేక అల్లాడిపోయాం. మేము పడ్డ కష్టాలు శ్రీశైలానికి కాలినడకన వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదని భావించాం. దాతల సహకారం, మా ట్రస్ట్ సహకారంతో 20 ఏళ్లుగా నాగలూటిలో అన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రతిరోజూ వేలాది మంది భక్తులకు ఆకలి తీరుస్తున్నాం. శ్రీశైల దేవస్థానం సహకరిస్తే భక్తులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

- పాటిల్, శ్రీశైల మల్లికార్జున మల్టీ పర్పస్ ట్రస్టు చైర్మన్, మహారాష్ట్ర

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

- కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎం. బాలునాయక్



కర్నూలు న్యూసిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని కార్మికులు అప్రమత్తంగా ఉండాలని కార్మిక శాఖ రాయలసీమ జోనల్ జాయింట్ కమిషనర్ ఎం. బాలునాయక్ అన్నారు. సోమవారం ధర్మపేట కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల రక్షణకు యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికలకు అనుగుణంగా కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. పని ప్రాంతాల్లో చల్లని నీరు, నీడ వసతి కల్పించాలని, అత్యవసర మందులు అదించాలని అన్నారు. డీహైడ్రేషన్ నివారణ మార్గాలపై కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు.

వేలంలో రూ.1.68 కోట్లు ఆదాయం

మహానంది, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మహానందిలో సోమవారం నిర్వహించిన బహిరంగ వేలాల ద్వారా దేవస్థానానికి రూ.1.68 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏడాది పాటు మహానందికి వచ్చే భక్తుల వాహనాల నుంచి రెండు టోల్ గేట్ల ద్వారా వసూలు చేసే టెండరును తిమ్మాపురానికి చెందిన నాగభూపాల్‌రెడ్డి రూ.1.68 కోట్లకు సీల్‌టెండర్ ద్వారా దక్కించుకున్నారని చెప్పారు. అలాగే ఆలయం ముందు భాగంలోని ఎనిమిది ఖాళీ స్థలాల్లో షాపులు ఏర్పాటు చేసుకునేందుకు బహిరంగ వేలాలు నిర్వహించామని తెలిపారు. భక్తుల పాదరక్షలు, మరుగుదొడ్ల నిర్వహ ణ హక్కుకు దేవస్థానం నిర్ణయించిన పాటకు టెండర్‌దారులు ముం దుకు రాకపోవడంతో వాయిదా వేశామని ఈవో చెప్పారు. కార్యక్రమం లో దేవస్థానం ఏఈఓ యర్రమల్ల మధు, గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌శెట్టి, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, సిబ్బంది నీలకంఠరాజు, మల్లిఖార్జున, పసుపుల సుబ్బారెడ్డి, నాగమల్లయ్యలు పాల్గొన్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ..

- పరీక్ష రాసిన విద్యార్థిని



విద్యార్థిని మమత

క్రిష్ణగిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పుట్టెడు దుఃఖంలోనూ ఓ విద్యార్థిని పరీక్ష రాసింది. క్రిష్ణగిరి గ్రామానికి చెందిన చాకలి మద్దిలేటి(40) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మరణించాడు. తండ్రి మృతి చెందిన బాధను దిగమింగుకొని కూతురు మమత సోమవారం జరిగిన పరీక్షకు హాజరైంది. అనంతరం జరిగిన తండ్రి అంత్యక్రియలలో పాల్గొంది.

గూడ్స్‌రైలు ఢీకొని వృద్ధుడి మృతి

ఆదోని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆదోని- కోసిగి స్టేషన్ల మధ్య కేఎం నెంబరు 523/33-31 అప్‌లైన్ ట్రాక్ వద్ద గూడ్స్ రైలు ఢీకొని తలారి ఈరన్న (60) మృతి చెందినట్లు ఆదోని రైల్వే పోలీసు స్టేషన్ ఎస్సై గోపాల్ తెలిపారు. కోసిగా మండలం జుమ్మాలదిన్నె గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన తలారి వీరన్న రైల్వే పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొన్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ వెల్లడించారు.

అన్నపై తమ్ముడి దాడి.. కేసు నమోదు

గోనెగండ్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో అన్న చాకలి క్రిష్ణపై తమ్ముడు చాకిలి ఈరన్న రాళ్లతో దాడి చేసి గాయపరిచినట్లు సీఐ విజబాస్కర్ తెలిపారు. చాకలి క్రిష్ణ, చాకలి ఈరన్న అన్నదమ్ములు. వీరికి గంజహళ్లి క్రాస్ రోడ్డులో మూడు సెట్ల స్థలం ఉంది. స్థలం విషయంలో ఇద్దరి మధ్య కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. అయితే సోమవారం స్థలం దగ్గరకు చాకలి క్రిష్ణ వచ్చాడు. దీంతో అన్నదమ్ముల మధ్య ఘర్షణ ఏర్పడి వాదోపవాదాలు జరిగాయి. వాదనలు కాస్తా తీవ్ర స్థాయికి చేరడంతో ఈరన్న ఆగ్రహానికి లోనై క్రిష్ణపై రాళ్లతో దాడి చేశాడు. దీంతో క్రిష్ణ తలకు గాయమైంది. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు క్రిష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ జావలి

నంద్యాల క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న బండి ఆత్మకూరు మండలం జీసీపాలెం-నారాయణపురం గ్రామాల మధ్య బొగ్గులకాల్వ అలుగు వంక వద్ద నంద్యాల సుధాకర్‌రెడ్డి హత్య ఘటనలో నిందితులను సోమవారం అరెస్ట్ చేసినట్లు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మంద జావలి ఆల్ఫోన్స్ తెలిపారు. ఈ మేరకు నంద్యాల తాలుకా పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె నిందితుల వివరాలను వెల్లడించారు. బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన గుర్రాల రామస్వామి, గుర్రాల శివన్న అలియాస్ శివ అలియాస్ యెహోషువ, గుర్రాల తిరుపాలు, గుర్రాల లక్ష్మన్న అలియాస్ లక్ష్మణ్‌లను బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురం గ్రామ సమీపంలో గల ఏకశిల అభయాంజనేయస్వామి గుడి దగ్గర అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితులంతా తండ్రీ కొడుకులని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో సీఐ శ్రీనివాసులురెడ్డి, బండిఆత్మకూరు ఎస్సై జగన్‌మోహన్, మహానంది ఎస్సై రామ్మోహన్‌రెడ్డి, సిబ్బందిని అభినందించి రివార్డులకు సిఫార్సు చేసినట్లు ఏఎస్పీ మంద జావలి ఆల్ఫోన్స్ తెలిపారు.

ఎల్లెల్సీలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్



ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్న గ్రామస్థులు

పెద్దకడబూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేకడోణ గ్రామ సమీపంలోని ఎల్లెల్సీలోకి ట్రాక్టర్ దూసుకెళ్లిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రహిమాన్ పని నిమిత్తం ట్రాక్టర్‌ను పెద్దతుంబళం వైపు తీసుకెళ్తుండగా వెనుకకు తిప్పే సమయంలో పక్కనే ఉన్న ఎల్లెల్సీలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ రహిమాన్ ట్రాక్టర్ నుంచి బయటకు దూకివేశాడు. దీంతో డ్రైవర్‌కు ప్రమాదం జరగలేదు. అంతేగాక పక్కనే బట్టలు ఉతుకుతున్న మహిళల పక్క నుంచి ట్రాక్టర్ దూసుకెళ్లింది. అయితే మహిళలకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. కాలువలో పడిన ట్రాక్టర్‌ను గ్రామస్థులు బయటకు తీశారు.

కర్నూలు ప్రగతి అజెండా..!

స్మార్ట్‌సిటీగా కర్నూలు

ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేత సీఎం చంద్రబాబు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్‌లు కర్నూలు స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. నిధులు, ట్రాఫిక్ నియంత్రణకు ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.



హెడ్ స్లూయిస్ పనులతో ఆగిపోయిన ఆర్డీఎస్ కుడి కాలువ

- స్మార్ట్ సిటీగా కర్నూలును అభివృద్ధి చేయాలి
- వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక
- ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రాజెక్టులతో కరువు నివారణ
- గుండ్రేవులపై దృష్టి సారించాలి
- వాటర్ గ్రిడ్ ద్వారా తాగునీటి సమస్యకు చెక్
- నేడు, రేపు కలెక్టర్ల సదస్సు
- అమరావతికి బయలుదేరిన కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల సదస్సు రేపు, ఎల్లుండి నిర్వహించనుంది. రాబోయే ఏడాదికి 15 శాతం వృద్ధి సాధించాలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నారు. ఇందులో కీలకమైన ఐదు అంశాలు కర్నూలు ప్రగతి అజెండాగా కలెక్టరు పి.రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ అమరావతికి బయలుదేరారు. స్మార్ట్ సిటీగా కర్నూలు, వలసలు నివారణ, సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి సమస్యలు, కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు నేషనల్ హైవే రోడ్డు.. వంటి కీలక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు.

2019 జనవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన వేవతి ఎత్తిపోతల పథకం, ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాలకు నిధులు ఇవ్వాలి. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు లక్ష్యంగా వేదవతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణానికి 2019 జనవరిలో రూ.1,942.38 కోట్లు మంజూరు చేస్తూ జీవో.ఆర్‌టీ.నెం.77 జారీ చేశారు. టెండర్ల పూర్తి చేసి పనులు కూడా మొదలు పెట్టారు. సుమారుగా రూ.90 కోట్లు ఖర్చు చేశారు. అలాగే. మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గా ల్లోనే అత్యధికంగా వలసలు ఉన్నాయి. శాశ్వత పరిష్కా రం కోసం గత టీడీపీ ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి 2019 జనవరిలో జీవో ఆర్టీ నం.76 జారీ చేసి రూ.1,985.42 కోట్లు మంజూరు చేశారు. ఆర్డీఎస్ అనకట్ట దగ్గర హెడ్ స్లూయిస్ పనులు, కాలువ నిర్మాణం మొదలు పెట్టి 0.06 శాతం పనులు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పనులు అటకె క్కాయి. రాయలసీమ జిల్లాల జీవనాడి గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లా సమగ్ర అభివృద్ధే ప్రధాన అజెండా



జిల్లా కలెక్టర్ల సదస్సులో ఏ ఏ అంశాలపై హాజరు కావాలో సీఎంవో నుంచి వచ్చిన ఫార్మెట్ ప్రకారం జిల్లా సమగ్ర అభివృద్ధిపై నివేదిక తయారు చేశాం. ఐదు ప్రధాన అంశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లబోతున్నాం. అవకాశం ఉంటే ఇతర అంశాలపై కూడా చర్చిస్తాను. - పి.రంజిత్‌బాషా, కలెక్టర్, కర్నూలు

పశ్చిమ ప్రాంతంలో కేజీబీవీ స్కూళ్లు పెంచాలి

జిల్లా పశ్చిమ ప్రాంతంలో తల్లిదండ్రులతో కలసి స్కూళ్లలో చదువుకుంటున్న పిల్లలు కూడా వలస వెళ్లుతున్నారు. దీంతోవాళ్ల చదువు ఆగిపోతోంది. జిల్లాలో 26 కేజీబీవీ పాఠశాలు ఉన్నాయి. వాటి సంఖ్యను రెట్టింపు చేయాల్సి ఉంది.

కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు జాతీయ రహదారి

జిల్లాలో ఏకైక ప్రధాన రహదారి కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు రోడ్డు, ఆలూరు, కోడుమూరు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల ప్రజలు జిల్లా కేంద్రం కర్నూలుకు చేరుకోవాలంటే ఏకైక రహదారి. ఏళ్లు గడుస్తున్నా విస్తరణకు నోచుకోవడం లేదు. నేడు కలెక్టర్ల సదస్సులో ఈ రహదారి అభివృద్ధిపై కలెక్టర్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నారు.

దాహం తీరాలంటే 'వాటర్ గ్రిడ్' శరణ్యం

జిల్లాలో ఇప్పటికీ 1,16,264 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు లేవు. గాజుల దిన్నె, పులికనుమ, హంద్రీనీవా పత్తికొండ, గోరుకల్లు జలాశయాల నుంచి శుద్ధి చేసిన సురక్షిత తాగునీరు పైపులైన్ల ద్వారా 1.7707 టీఎంసీలు సరఫరా చేసి అందించేందుకు రూ.3,343.80 కోట్లతో వాటర్‌గ్రిడ్ ప్రతిపాదన తయారు చేశారు. వాటర్‌గ్రిడ్‌ను సీఎం చంద్రబాబు దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లనున్నారు.



ఆస్పరి మండలంలో తాగునీటి సమస్యకు నిదర్శనం

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

కొలిమిగుండ్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోర్విమానుపల్లెలో తీవ్ర విషాదం నెలకొంది. ఇంటి వద్ద తాగునీరు పట్టుకోవడానికి మోటార్ ప్లగ్ పెడుతుండగా విద్యుత్ షాక్ తగిలి విద్యార్థి ఆవుల విరాట్ యాదవ్(13) మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఆవుల బ్రహ్మయ్య కుమారుడు విరాట్ గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం నీళ్లు పట్టుకోవడానికి మోటార్ వేసే సమయంలో విద్యుత్ షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడిన విరాట్ యాదవ్‌ను స్థానిక వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆదివారం వెల్లడించారు.

డీలర్‌తో పాటు 14 మందిపై కేసు

రుద్రవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం గ్రామ సమీపంలోని ఆవుల నాగమ్మ మామిడి తోటలో సోమవారం పేకాట స్థావరాలపై దాడి చేసినట్లు ఏఎస్ఐ భూపాల్ రెడ్డి తెలిపారు. ఈ దాడిలో రుద్రవరం గ్రామానికి చెందిన చౌక దుకాణం డీలరుతో పాటు 14 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఎనిమిది మందిని అరెస్టు చేయగా మరో ఏడుగురు పరారైనట్లు పోలీసులు తెలిపారు.

పంజాబ్‌లో ఐఐటీ విద్యార్థి ఆత్మహత్య

- మృతుడు ప్యాపిలి మండల వాసి

ప్యాపిలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఐఐటీ విద్యార్థి రెండు రోజుల క్రితం పంజాబ్ రాష్ట్రంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థి మృతదేహాన్ని సోమవారం సొంత ఊరుకు తీసుకొచ్చారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి. మండలంలోని ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన సుధాకర్, సుధారాణి దంపతుల కుమారుడు అరుణ్‌కుమార్(23) పంజాబ్ రాష్ట్రంలోని రూపర్ ఐఐటీ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు.

మూడో సంవత్సరంలో ఒక సబ్జెక్టు విద్యార్థి ఫెయిలయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అరుణ్‌కుమార్ క్యాంపస్‌లోని తన గదిలో రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. గమనించిన తోటి విద్యార్థులు వెంటనే అరుణ్‌కుమార్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. చేతికొచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదన వర్ణణాతీతంగా మారింది.

గ్రామీణ అభివృద్ధే జాతీయ సదస్సు లక్ష్యం



సిల్వర్‌జూబ్లీ కళాశాలలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్

కర్నూలు అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే దేశ అభివృద్ధికి జాతీయ సదస్సు ఉపయోగపడుతుందని రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా క్లస్టర్‌తో పాటు, రాయలసీమ యూనివర్సిటీల రిజిస్ట్రార్ పి. విజయకుమార్ నాయుడు హాజరయ్యారు. వివిధ ప్రదేశాల నుంచి పత్ర సమర్పణ చేయడానికి 130 మంది అందించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చేపట్టిన స్కీంలను వివరంగా తెలిపారు. ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి, ఎల్లా కృష్ణ, డాక్టర్ అక్తర్‌బాను, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద శాతం సబ్సిడీపై డిప్పు

- ఏపీ ఎంఐపీ పీడీ ఉమాదేవి

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డ్రిప్పు పరికరాల ఏర్పాటు కోసం ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల రైతులకు వంద శాతం సబ్సిడీ ఇస్తోందని ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఏపీఎంఐపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో 90 శాతం ఉన్న సబ్సిడీని కూటమి ప్రభుత్వం ఐదెకరాల్లోపు పొలం ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరు శాతం సబ్సిడీతో పరికరాలను ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. 5 నుంచి 10 ఎకరాల లోపు ఉన్న రైతులకు గతంలో 70 శాతం సబ్సిడీ ఉండేదని, ఇప్పుడు 90 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. జీవో నెం.82 ప్రకారం అర్హులైన రైతులందరికీ కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా 50 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటి దాకా కర్నూలు జిల్లాలో 30,872 మంది డ్రిప్పుతోపాటు స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకున్న రైతులు ఉన్నారని, 34,132 హెక్టార్లలో డ్రిప్పు, స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. ఆస్పరి, దేవనకొండ, కల్లూరు, క్రిష్ణగిరి, మంత్రాలయం, తుగ్గలి, వెల్దుర్తి, పత్తికొండ, మద్దికెర, కర్నూలు, గోనెగండ్ల, దేవనకొండ, ఆదోని ప్రాంతాల్లో డ్రిప్పు, స్ప్రింక్లర్ల ఏర్పాటుతో రైతులు తక్కువ నీటితోనే పంటలు సాగు చేస్తున్నారని, మిగిలిన రైతులు కూడా డ్రిప్పు పరికరాల కోసం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వివరాలను నమోదు చేయించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

ఎండుతున్నది

- నదీతీర గ్రామాల్లో తాగునీటి కష్టాలు
- భక్తులకు తుంగభద్ర నీరు కరువు



మంత్రాలయం వద్ద తుంగభద్రలో నిలిచిన నీరు

మంత్రాలయం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర నది ప్రవాహం ఆగిపోయింది. దీంతో నదీతీర గ్రామాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తాగునీటి పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని జనాలు ఆందోళన చెందుతున్నారు.

నదీతీర గ్రామాలైన మంత్రాలయం, కోసిగి, కౌతాళం, నందవరం, సి.బెళగల్ మండలాల పరిస్థితి తాగునీటి ఇబ్బం దులు తలెత్తుతున్నాయి. తాగునీటి పథకాలు, పంపుసెట్లకు ఇప్పటికే దాదాపు అందడం లేదు. అధికారులు ప్రత్యామ్నాయ ప్రణాళికలు చేపట్టకపోతే ప్రజలు దాహంతో అల్లాడించే పరిస్థితి ఉంది. నదీతీర గ్రామాల్లోని సూగూరు, దిబ్బనదొడ్డి ఎస్ఎస్ ట్యాం కుల ద్వారా ఐదు మీటర్ల మేర నీటిని నిల్వ ఉంచారు. 14 గ్రామా లకు అధికారులు అందిస్తామని చెబుతున్నా ఆరు గ్రామాలకు మించి అందడం లేదు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, శ్రీమఠం అధికారులు స్పందించి తుంగభద్ర డ్యాం అధికారులతో మాట్లాడి తాగునీటి కోసం నీటిని విడుదల చేయించాలని కోరుతున్నారు

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



భక్తులకు ఇబ్బందులు లేకుండా మినరల్ వాటర్‌ను ఏర్పాటు చేశాం. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు డ్యాం అధికారులతో మాట్లాడి నీరు అందించే ప్రయత్నాలు చేస్తాం. షవర్ల ద్వారా స్నానాల సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. - ఎల్.మాధవశెట్టి, రిటైర్డు రీజనల్ జాయింట్ కమిషనర్, ఏఏఈవో శ్రీమఠం

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం



తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం. వారం క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ నదీతీరాన్ని పరిశీలించారు. బోర్లకు మరమ్మతులు చేయించి గ్రామాలకు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. నీరు అందుబాటులో లేని గ్రామాలకు ట్యాంకర్లను ఏర్పాటు చేస్తున్నాం. - వెంకట్రాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, మంత్రాలయం

గౌరు సమక్షంలో టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో గౌరు దంపతులు

కల్లూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): 30వ వార్డు శరీన్‌నగర్‌కు చెందిన పది వైసీపీ కుటుంబాలు గౌరు దంపతుల సమక్షంలో తెలుగు దేశం పార్టీలో చేరారు. సోమవారం మాధవీ నగర్‌లోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై టీడీపీలో చేరినట్లు సభ్యులు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో సుమన్, క్రిష్టఫర్, అబ్రహం, బుజ్జి, కిరణ్, శేషు, రాజు, రమేష్, వంశీ ఉన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ వార్డుల అధ్యక్షుడు పెరుగు పురుషోత్తంరెడ్డి, వీరేంద్రకుమార్, సందీప్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి: సీపీఎం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాగన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. తల్లికి వందనం తదితర పథకాలు తక్షణమే అమలు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్య క్రమంలో నాయకులు మధుసూదన్, శ్రీరాములు, హుశేన్, శ్రీనివాసులు, కృష్ణ, మంజుల, గోవిందమ్మ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

గూడూరు మార్చి 24(ఆంధ్రజ్యోతి): గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 22న పురుగుల మందు తాగిన జులకల్ గ్రామానికి చెందిన కౌలు రైతు దేవరాజు(29) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గూడూరు మండలం జులకల్ గ్రామానికి చెందిన కౌలు రైతు దేవరాజు వ్యవసాయం చేస్తూ జీవనం చేస్తున్నాడు. 24 ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. వేసిన పంటలు సరిగ్గా పండక పోవడంతో నష్టపోయి దాదాపు రూ.8లక్షల యాభై వేల వరకు అప్పులు చేశాడు. వేసిన పం టలు పండకపోవడం, పంటల సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చా లో తెలియక దేవరాజు ఈ నెల 22న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు దేవరాజును కర్నూలు ప్రభుత్వ అసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం మృతుడి తండ్రి పెద్ద అయ్యన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. మృతునికి భార్య కవిత, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

న్యాయవాదులకు రక్షణ కరువు

కర్నూలు లీగల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సమాజంలో న్యాయవాదు లకు రక్షణ కరువైందని, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది ఇజ్రాయేల్‌ను హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, బీఎస్ రవికాంత్ ప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాదుల పరిరక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని, ఇజ్రా యేల్‌ను హత్య చేసిన నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

భూసార పరీక్షలతో అధిక లాభాలు: ఏవో

సి.బెళగల్, 24 మార్చి(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో అధిక లాభాలు సాధించవచ్చు అని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో ఉన్న వ్యవసాయ అసిస్టెంట్లను రైతులను సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎంపీఈవోలు, రైతులు ఉన్నారు.

రోడ్డు వేయండి: మండల కేంద్రమైన సి.బెళగ ల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పలుకుదొడ్డి క్రాస్ వరకు రోడ్డు వేయాలని మహిళలు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎంపీడీవో రాణెమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరమ్మ, నీలమ్మ, రామక్క, లింగమ్మ పాల్గొన్నారు.

క్షయ వ్యాధికి ఆధునిక వైద్యం: డీఎంహెచ్‌వో





క్విజ్‌లో ప్రథమ బహుమతి పొందిన వైద్య విద్యార్థినులకు మెమెంటో అందజేస్తున్న డీఎంహెచ్‌వో, జిల్లా న్యాయాధికారి, వైద్యులు, లద్దగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

కర్నూలు హాస్పిటల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గతంలో క్షయ వ్యాధి వస్తే ప్రాణపాయం తప్పదన్న భయం ఉండేదని, ప్రస్తుతం ఈ వ్యాధి చికిత్సకు ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయని డీఎంహెచ్‌వో పి. శాంతికళ అన్నారు. సోమవారం కర్నూలు జీజీహెచ్ ఓల్డ్ సీఎల్‌జీలో ప్రపంచ క్షయ దినోత్సవం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, డీఎంహెచ్‌వో, జిల్లా టీబీ ఆఫీసర్ డా.ఎల్. భాస్కర్, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పి.వెంకటేశ్వర్లు, డిస్ట్రిక్ట్ టీబీ రిటైర్డు ఆఫీసర్ డా.మోక్షేశ్వరుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం క్షయ వ్యాధి నివారణకు ఎంతో విలువైన మందులు ఉచితంగా అందజేస్తోందని అన్నారు. పూర్తిగా మందులు వాడితే వ్యాధి నయమవుతుందని తెలిపారు. అనంతరం జిల్లాలో టీబీ ముక్త్ పంచాయతీలుగా ఎన్నికైన 28 మంది సర్పంచులకు ప్రత్యేక బహుమతులను ప్రదానం చేశారు. క్షయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన పీజీ, ఎంబీబీఎస్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ జి. మల్లికార్జున రెడ్డి, సేవాభారతి అధ్యక్షుడు డా.శ్రీనివాసరెడ్డి, పల్మనాలజి హెచ్‌వోడీ డా.శ్రీకాంత్, రిటైర్డు గైనిక్ హెచ్‌వోడీ డా.వెంకటరమణ, ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

● **ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో:** టీబీ హారేగా.. దేశ్ జీతేగా టీబీ ఫ్రీ ఇండియాపై ప్రతి పౌరుడు ప్రతిజ్ఞ చేసి వ్యాధిని తరిమివేయాలని కర్నూలు మెడికల్ కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.అరుణ అన్నారు. సోమవారం నగరంలోని శ్రీరామ్‌నగర్ కాలనీ, అర్బన్ హెల్త్ సెంటర్‌లో కమ్యూనిటీ మెడిసిన్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా.దివ్య, వైద్యులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

● **మెడికవర్ హాస్పిటల్‌లో:** క్షయ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే పూర్తిగా నివారించే వీలు ఉంటుందని కర్నూలు మెడికవర్ హాస్పిటల్ పల్మనాల జిస్టులు డా.కమ్మర వినోద్ ఆచారి, డా.సువర్ణలక్ష్మి అన్నారు. వరల్డ్ టీబీ డే పురస్కరించుకుని హాస్పిటల్‌లో రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పిటల్ కర్నూలు క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: క్షయవ్యాధిని నిర్మూలిద్దామని లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ పిలుపు నిచ్చారు. మార్చి 24న ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ దగ్గిన లేదా తుమ్మినపుడు క్షయ క్రిములు గాలి ద్వారా ఇతరులకు వ్యాపించే అవకా శం ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ఎ డ్యుకేటర్ శ్రీనివాసయాదవ్, సీహెచ్‌వో శాంత, సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహించాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికా రులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా నవ్య మాట్లడుతూ నేడు కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు దగ్గర గల అయాన్ డిజిటల్ ఇన్స్టిట్యూ ట్‌లో ఏపీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డులోని అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ నియామకం కోసం పరీక్షలు, ఎమ్మిగనూరులోని సెయింట్ జోసెఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో అనలిస్టు గ్రేడ్-2 నియామకం కోసం పరీక్షలు ఈనెల 26న ఎఫ్ఎన్ నంద్యాల చెక్‌పోస్టు దగ్గర అయాన్ డిజిటల్ ఇన్స్టిట్యూట్‌లో అనలిస్టు గ్రేడ్-2 నియామకం కోసం పరీక్షలు ఏఎన్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నియామకం కోసం పరీక్షలు, 27న ఎఫ్ఎన్ అయాన్ డిజిటల్ ఇన్స్టిట్యూ ట్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నియామకం కోసం పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరీక్షలు కంప్యూటర్ ద్వారా నిర్వహించడం చేత విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్‌ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని, ఇన్విజిలేటర్లు వద్ద కూడా ఫోన్లు ఉండరాదన్నారు. సమావేశంలో కలెక్టర్ కార్యాలయం ఏవో విజయశ్రీ, జిల్లా వైద్యఆరోగ్య అధికారి ఏపీ ఎస్పీడీసీఎల్ సిబ్బంది, పోలీసు శాఖ, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ డిలేశ్వరరావు, లైజనింగ్ ఆఫీసర్స్, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ సెక్షన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎం. త్రివిక్రమ్

కర్నూలు లీగల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎం. త్రివిక్రమ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల ఎన్నికలలో నామినేషన్ల దాఖలు చేసేందుకు సోమవారం చివరి తేదీ కాగా, ఉపాధ్యక్ష పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రెజరర్‌గా మన్నె గౌతమ్, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శిగా బెస్త సుధాకర్, మహిళా ప్రతినిధిగా ఎస్కే అరుణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, అధ్యక్ష పదవికి, ప్రధాన కార్యదర్శి పదవికి ముగ్గురేసీ అభ్యర్థులు కార్యదర్శి, లైబ్రరీ కార్యదర్శి పదవులకు ఇద్దరు చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్లు ఉపసంహరణకు ఆఖరు. ఎన్నికలు 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి సి.విజయకుమార్ తెలిపారు.

సాంఘిక సంక్షేమ అధికారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడుమూరు ఎస్సీ హాస్టల్‌లో ఆరో తరగతి విద్యార్థిని అక్కడ సీనియర్‌గా ఉన్న విద్యార్థిని బెల్టుతో చితక బాదుతూ గాయాలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పత్తికొండ మండల కేంద్రంలో ఐదు రోజుల క్రితం ఎస్సీ ఇంటిగ్రేటెడ్ సంక్షేమ వసతి గృహంలో 9వ తరగతి చదువున్న విద్యార్థి వంటిపై సాంబర్ పడి శరీర సగభాగం కాలిపోయిందన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కనీసం పరామర్శించడం లేదన్నారు.

● **కారుణ్య నియామకంపై విచారణ చేపట్టాలి:** నందికొట్కూరు ప్రభుత్వ పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎస్.నారాయణ కారుణ్య నియామకంపై విచారణ చేపట్టాలని జాతీయ లంబాడి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యోగేష్ నాయక్ జాయింట్ కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ తండ్రి మద్దిలేటి నకిలీ షెడ్యూ ల్ తెగలకు చెందిన సర్టిఫికెట్‌తో గుంతకల్లులో డిజిల్ మెకానిక్‌గా పని చేస్తున్నారన్నారు. కానీ బీసీ వర్గానికి చెందిన మద్దిలేటి తండ్రి కర్నూలు గవర్నమెంటు హాస్పిటల్ పని చేస్తూ చనిపోయారన్నారు. నారాయణ తన తండ్రి మద్దిలేటి కాకుండా వారి తాత పేరుతో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్‌ను సృష్టించి కారుణ్య నియామకం పొందారన్నారు. తండ్రి ఎస్టీ, కొడుకు బీసీ మీద ఉద్యోగం పొందారన్నారు. నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసిన రెవెన్యూ ఉద్యోగులతోపాటు నారాయణపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

● దేవనకొండ మండలం వెలుగు సీసీ తనూజ ఏటీఎం నరసన్న వందనపై చర్యలపై తీసుకోవాలని పొదుపు ప్రగతి సంఘం సభ్యురాలు అనూరాధ, ఐక్యసంఘం సభ్యురాలు నాగలక్ష్మిలు జాయింట్ కలెక్టర్‌కు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపు సంఘం నుంచి రూ. 2 లక్షలు తీసుకుని మమ్మల్ని మోసం చేశారన్నారు. పొదుపు సంఘం డబ్బులు ఇప్పించాలని కోరారు.

● కౌతాళం మండలం కేంద్ర నివాసి జంబులదిన్నె చిన్న మూకమ్మ మాకు సర్వే నెంబరు 529/ఈ2లో 4 ఎకరాల 86సెంట్ల భూమి ఉంది. కానీ ఆన్‌లైన్‌లో 3 ఎకరాల 52 సెంట్ల భూమి మాత్రమే నమోదైందని, మిగులు భూమిని కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.



జేసీకి వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

● కల్లూరు మండలం పర్లగ్రామ నివాసి పి.నాగేశ్వరరావు మా గ్రామ పొలిమేరలు సర్వేనెంబరు 763/ఏ1లో 2 ఎకరాల 70 సెంట్లు భూమి ఉంది. పొరపాటున ఆన్‌లైన్‌లో నా పేరుకు బదులుగా వేరే వారి పేరు నమోదు చేశారు. అలాకాకుండా మా పేర్లు నమోదు చేయాలని కోరారు.

నేషనల్ లెవెల్ మేనేజ్‌మెంట్ మీట్‌లో ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన నేషనల్ లెవెల్ మేనేజ్మెంట్ మీట్‌లో కర్నూలు పుల్లయ్య కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బిజినెస్ క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు ఎంబీఏ విభాగాధిపతి సి.నాగగణేష్ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మొదటి బహుమతి సాధించిన అంబిక, శర్వాణి, ఉషారాణిలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంబీఏ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి. బెళగల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబదహల్, బ్రాహ్మణదొడ్డి, సంగాల, తిమ్మనదొడ్డి గ్రామాల్లోని తాగునీటి పథకాలను ఎంపీడీవో రాణెమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు ఏఈ గోనెనాయక్ సోమవారం పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ గ్రామాల్లోని బోర్లు, విద్యుత్ మోటార్లకు మరమ్మతు చేయించాలన్నారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. ఏపీ విద్యుత్ మీటర్స్ రీడర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. మునెప్ప మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు పాదయాత్రలో మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తక్షణమే సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 27న సీఎం కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్ర శేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలి: నగర ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ రవీంద్ర బాబుకు వినతిపత్రం అందజేశారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ నగరంలో 10 మినీ వాహనాలను ఏర్పాటు చేసి ప్రతి ఇంటి నుంచి చెత్త ను సేకరించాలన్నారు. పలు కాలనీల్లో కాలువలు, పారిశుధ్య, రోడ్లు, పార్కుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ కాలనీ ప్రతినిధులు ఎంపీ చాంద్‌బాషా, ఎస్.మాణిక్యరెడ్డి, వెంకటనర్సు, రమణగౌడు, ప్రభాక ర్‌రెడ్డి, యాకోబు, జి.శంకర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మీటర్ రీడర్లు

వైద్యమిత్రలను రెగ్యులర్ చేయాలి

కర్నూలు హాస్పిటల్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఫీల్డ్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని ఏపీ వైద్య సేవ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జి.నాగరాజు, స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కే.దేవేంద్ర నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న వైద్యసేవ ఫీల్డ్ ఉద్యోగులు సోమ వారం విధులు బహిష్కరించారు. కలెక్టరేట్ ఎదుట వైద్యమిత్రలు శాంతియుత నిరసన తెలిపారు. అనంతరం డీఆర్వోకు వైద్యమిత్ర ఫీల్డ్ సిబ్బంది, ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాలకు చెందిన వైద్యమిత్ర, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు ఆఫీస్ అసిస్టెంట్లు, సీసీడీఈవో, యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కంబగిరి, ఉపాధ్యక్షుడు జి.రాజశేఖర్ రెడ్డి, వైస్ సెక్రటరీ గౌస్ పాల్గొన్నారు.

సమస్యలు పునరావృతం కాకుండా చూడాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరి ష్కార వేదికలో వచ్చిన సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశిం చారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈలు సత్యనారాయణ, శేషసాయి, శానిటరీ సూపర్ వైజర్ నాగరాజు, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కర్నూలు న్యూసిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుని మిలాద్ కమిటీ జిల్లా సభ్యుడు నజీర్ హుస్సేన్ అధ్వర్యంలో పేద మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. సోమవారం 47వ వార్డు ధర్మపేటలో జరిగిన కార్యక్రమానికి హోమియో వైద్యుడు భాస్క ర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మహిళలకు చీరెలు పంపిణీ చేశారు.

అన్నదాన సేవలు అభినందనీయం

కర్నూలు కల్చరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం వెళ్లే పాద యాత్రికులకు ఏటా రెండు పర్యాయాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయమని శ్రీశైలంలోని దత్తసాయి మౌన స్వామి ఆధ్యాత్మిక ఆశ్రమం పీఠాధిపతి చిదానంద స్వామీజీ అన్నారు. ఐదు రోజులుగా నగరంలోని నందికొట్కూరు రోడ్డులోగల మారుతీనగర్‌లోని దత్తసాయి ఆధ్యాత్మిక ఆశ్రమ నిర్వాహకుడు మండలి వెంకట భవానీ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని ఆయన సందర్శించి వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ భగవంతుని కృప ఉంటేనే అన్నదాన కార్యక్రమాలు చేసే అవకాశం లభిస్తుందన్నారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

కర్నూలు కల్చరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలూ నాయక్ అన్నారు. సోమవారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో, రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం ఉంటున్న నిరుపేద ముస్లింలకు నిత్యావసర వస్తువులు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశాఖపట్నంలో ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న కర్నూ లు వాసి హుస్సేన్ సాహెబ్, హుస్సేనమ్మల చిన్న కుమార్తె డి.షబానా, భర్త ఎస్ఎండీ యాసీన్, కుమారుడు ఎస్ఎండీ అయ్యాన్‌లు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షతన పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ కె.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సోపై న్యాయ విజ్ఞాన సదస్సు

కోడుమూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో పోక్సో చట్టంపై సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి కర్నూలు మొదటి అదనపు జిల్లా న్యాయా ధికారి జి.భూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచు భాగ్యరత్న, ట్రైనీ జ్యూడిషియల్ ఆఫీసర్ ఈశ్వరవెంకటప్రసాద్, లీలా సాయి, హేమ, అర్చన, శ్రీవల్లి, కోడుమూరు డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో రాముడు, ఎస్ఐ శ్రీనివాసులు, మహిళ పోలీసులు, పొదుపు మహిళలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలోని జహారాబాదులో ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే 46వ జాతీయ స్థాయి జూనియర్ బాలుర అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు రాణించాలని ఆ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్టును అందజేశారు.

కేవీ సుబ్బారెడ్డి అభినందనీయుడు

కర్నూలు అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి ఎనలేని సేవలందించారని పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాల యంలో కేవీ సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, జేతం క్రిష్టుడు, ధరూర్ జేమ్స్ హనుమంతరావు చౌదరి, పేరపోగు రాజు హాజరయ్యారు. కార్యక్రమంలో మంచాల కట్ట భాస్కరరెడ్డి, ఈరన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో భాగంగా నగరంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ టి.శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారిరోడ్ సెక్షన్‌లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సంతోష్‌నగర్ సెక్షన్‌లో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు, కల్లూరు మండలంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కరెంట్‌కోత ఉంటుందన్నారు.

ఓర్వకల్లులో నేడు వేలం

ఓర్వకల్లు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం రచ్చకట్ట వద్ద వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు సోమవారం తెలిపారు. బండ్లమెట్ట నాలుగు రూములకు వేలం వేయనున్నట్లు తెలిపారు. పాటాదారులు బండ్లమెట్టకు రూ.20వేలు, నాలుగు రూములకు రూ.10వేలు డిపా జిట్ చెల్లించాలన్నారు.

రాయపాటి శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్



కర్నూలు కల్చరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన లయన్స్ క్లబ్ సీనియర్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు ఇరాక్ దేశంలోని విక్టోరియా యూనివర్సిటీ ఆఫ్ కల్చర్ అండ్ వరల్డ్ పీస్ విశ్వ విద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ లభించింది. సోమవారం నిర్వహిం చిన అంతర్జాల అంతర్జాతీయ సమావేశంలో విక్టోరియా యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ ముస్తఫా డిసోకి ఈ పురస్కారాన్ని ప్రకటించి, రాయపాటి శ్రీనివాస్‌కు అంతర్జాలంలో పంపించారు. కర్నూలుకు చెందిన రాయపాటి శ్రీనివాస్ నైస్ కంప్యూటర్ శిక్షణ సంస్థ ద్వారా వేలాది మంది నిరుద్యోగ యువత ఉపాధికి కృషి చేస్తున్నారు. అలాగే నైస్ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ సొసైటీ ద్వారా విద్య, కళ, సామాజిక సేవా రంగాల్లో యువతను ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లయన్స్ క్లబ్‌లో ముఖ్య ప్రతినిధిగా జిల్లాలో వందలాది అనేక మంది వైద్యుల సహకారం తీసుకొని కంటి, దంత వైద్య శిబిరాలు, గుండె, ఊపిరితిత్తులు, బీపీ, షుగర్ పరీక్షల శిబిరాలు నిర్వహిస్తున్నారు. 2024 ఏడాదికి గాను సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఇచ్చే గౌరవ డాక్టరేట్‌ను రాయపాటి శ్రీనివాస్‌కు ప్రదానం చేసినట్లు విక్టోరియా యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ ముస్తఫా డిసోకి ప్రకటించారు.

1న రాతిదూలం పోటీలు

కల్లూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఉగాది పురస్కరించుకుని శ్రీచౌడేశ్వరి, చాముండేశ్వరి, సుంకులా పరమేశ్వరి, మాతా మారెమ్మ తిరుణాళ్ల సందర్భంగా ఏప్రిల్ 1న రాతి దూలం పోటీలు నిర్వహించనున్నట్లు రైతుసంఘం అధ్యక్షుడు సంపతి లక్ష్మీరెడ్డి తెలిపారు. సోమవారం గ్రామపెద్దలు, రైతుసంఘం నాయకులు బ్రోచర్‌ను విడుదల చేశారు. సంపతి లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ ఉగాది ఉత్సవాలను పురష్కరించుకుని న్యూకెటగిరి విభాగంలో నిర్వహించే రాతి దూలం పోటీలకు ఆసక్తి గల రైతులు ప్రవేశ రుసుము రూ.1000 చెల్లించి రసీదు పొందాలన్నారు. రాతిదూలం పోటీల్లో గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ రూ.54 వేలు, తృతీయ రూ.40 వేలు, నాల్గవ రూ.30వేలు, ఐదవ రూ.25 వేలు, ఆరో రూ.20వేలు, ఏడో బహుమతి రూ.10 వేలు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ -99896 42639, 93938 68039 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్వీ రామకృష్ణ, దేవదానం, జీఎస్.వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, జీఎస్. నాగరాజు, జగదీష్, రాముడు, కురువ మల్లయ్య, మలిక్‌బాషా పాల్గొన్నారు.

రైతును ముంచిన పంటలు

• గిట్టుబాటు కాని ఉల్లి, వంకాయలు • ఉల్లి సాగుతో నష్టపోయామని రైతుల ఆవేదన • వంకాయలను పొలంలోనే వదిలేసిన రైతు



ఉల్లిగడ్డలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



ఈ మహిళా రైతు పేరు లక్ష్మి. దేవనకొండ మండల అలారుదిన్నె గ్రామం. ఈ ఏడాది అర ఎకరాలో వంకాయ సాగు చేయగా ధర అమాంతం పడిపోవడంతో చేసేదేమి లేక వంకాయలను అలాగే పొలంలో వదిలేసింది. రూ.30 వేలు పెట్టుబడి పెట్టానని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది.

దేవనకొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో దాదాపు 500 ఎకరాలకు పైగా రైతులు ఉల్లి సాగుచేశారు. రూ.వేలు ఖర్చుచేసి పంటను కాపాడుకున్నారు. దిగుబడి 70 క్వింటాళ్ల రారా, తీరా దిగుబడి వచ్చేసనికి ధర అమాంతం పడిపోయింది.

పెట్టుబడి ఇలా..

ఉల్లి సాగుకు ఎకరాకు రూ.1.20లక్షలు ఖర్చు అవుతుంది. నారు కొనేందుకు, నాటుకుని, పురుగుమందులు, ఎరువులు తదితర పనులకు ఖర్చు చేయాలి.

పడిపోయిన ధరలు

పంట చేతికి వచ్చేసరికి మార్కెట్లో ఉల్లి ధర అమాంతం పడిపోయింది. గతంలో క్వింటం రూ.3వేల వరకు పలుకగా, ప్రస్తుతం రూ.1,200లకు పడిపోయింది. దీంతో ఈ ధర గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారు. ఉల్లిని కోసి, గ్రేడింగ్ చేసి, మార్కెట్ తరలించాలంటనే ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉల్లితో రూ.50 వేలు నష్టం



ఎకరాలో రూ.1.20 లక్షల పెట్టుబడి పెట్టి ఉల్లిపంట సాగు చేశా. దాదాపు 130 ప్యాకెట్లు దిగుబడి వచ్చింది. ధర పడిపోవడంతో రూ.70 వేలు వస్తుంది. దీంతో రూ.50వేలు నష్టపోయా. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలి. **- సంజీవరాయుడు, రైతు, అలారుదిన్నె**

వడదెబ్బతో మహిళ మృతి

దేవనకొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడికొండ గ్రామానికి చెందిన వివాహిత రజిత (22) వడదెబ్బతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. సి.బెళగల్ మండలానికి చెందిన మద్దిలేటి, వెంకటేశ్వరమ్మ దంపతుల కుమార్తె రజితకు కరిడికొండ గ్రామానికి చెందిన కాశీపతి, రామక్క కుమారుగు రంగడుతో ఐదేళ్ల క్రితం వివాహం చేశారు. బుదవారం గద్దెరాళ్ల దేవరలో రజిత కలసం పట్టడంతో వడదెబ్బకు గురైంది. ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబసభ్యులు శనివారం కర్నూలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. రక్తకణాలు తగ్గిపోవడంతో కోలుకోలేక ఆదివారం సాయంత్రం మృతి చెందింది. ఆమెకు 8 నెలల బాబు ఈశ్వర్ ప్రసాద్ ఉన్నాడు.



రాధిక (ఫైల్)

నేడు వేలం పాట

వెల్దుర్తి టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ దుకాణాల వేలం పాటు మంగళవారం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి లక్ష్మీనాథ్ తెలిపారు. ఉదయం 9 గంటలకు దుకాణాలతో పాటు బస్టాండు, కమేలాలు, మార్కెట్‌కు వేలాలు నిర్వహిస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక

ఆదోని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప పేర్కొన్నారు. సోమవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టీడీపీ అధినాయత్వం సూచన మేరకు ప్రజా సమస్యలను తెలులుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కురువలకు కార్పొరేషన్ ద్వారా అధిక యూనిట్ల మంజూరుకు ఆధిష్టానంతో చర్చిస్తానన్నారు.



వినతులు స్వీకరిస్తున్న దేవేంద్రప్ప

'సూపర్ సిక్స్' అమలు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. లింగన్న, వీరారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద ఎస్సైగా దిలీప్ కుమార్



ఎస్సైని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

హొళగుంద, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సబ్ ఇన్‌స్పెక్టర్‌గా గురజాల దిలీప్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను టీడీపీ నాయకులు బీజే పంపాపతి, ఎర్రిస్వామి, దిడ్డి వెంకటేష్, తిప్పన్న, డీలర్ అంజి సన్మానించారు. ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, జూదం, అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

బీజేపీ నాయకుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న రామ్మోహన్

పత్తికొండ టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ పాండిచ్చేరీలో ఆదివారం అందుకున్నారు. సేవా కార్యక్రమాలు చేసినందుకు శాంతి విశ్వవిద్యాలయం అందజేసింది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న తనిఖీ బృందం

హొళగుంద, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని యన్‌క్యూఏస్ టీం సభ్యులు డాక్టర్ సుకుమార్, డాక్టర్ రామేశ్వర్ పాండే సోమవారం తనిఖీ చేశారు. ఆసుపత్రి గదులను వైద్య పరికరాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిలో నెలకు 35 కాన్పులు జరగడంపై సిబ్బందిని అభినందించారు. వైద్యాధికారులు డాక్టర్ న్యూటన్, డాక్టర్ బిందు మాధవి, డాక్టర్ రూప్‌కుమార్, సీహెచ్‌వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీలోకి అంగన్‌వాడీలు

పత్తికొండ టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం 60 మంది అంగన్‌వాడీ వర్కర్స్ సీఐటీయూను వీడి ఏఐటీయూసీలో చేరారు. పత్తికొండ ఐసీడీఎస్ యూనియన్ నాయకురాలు కాంతమ్మ, ఈరమ్మ, చిట్టెమ్మ, తిరుపతమ్మతో పాటు 60 మంది చేరగా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మలు ఏఐటీయూసీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

• సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



అర్జీదారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ఆదోని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో సబ్ కలెక్టర్ అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని

1. పొలానికి విద్యుత్ కనెక్షన్ కోసం డీడీ కట్టినా ఇంకా ఇవ్వలేదని మంజూరు చేయించాలని ఆదోని మండలం నెట్టకల్ గ్రామానికి చెందిన హరిసింగ్ అర్జీ ఇచ్చారు.
2. ఆదోని మండలంలో తాగునీరు, రోడ్లు, పారిశుధ్య సమస్యలు, తదితర సమస్యలను పరిష్కరించాలని సీపీఐ (మార్కిస్ట్) మండల కార్యదర్శి లింగన్న అర్జీ సమర్పించారు.
3. తాను సర్వేనెం. 124సిలో నివాసముంటున్నానని, పట్టా మంజూరు చేయాలని ఆదోని మండలం దొడ్డనగిరి గ్రామానికి చెందిన మునిస్వామి అర్జీ సమర్పించారు.
4. తనకు సర్వే నెం.250 బిలో 4.10 ఎకరాల భూమి ఉండగా ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు నమోదైందని, విచారించి తన పేరు నమోదు చేయాలని కౌతాళం మండలం హాల్వి గ్రామానికి చెందిన శ్రీ పాదారావు అర్జీ సమర్పించుకున్నారు.

డిప్యూటీ ఇన్స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాస రాజు, వేణు సూర్య, డీఎల్పీవో నూర్జహాన్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్, రఫీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ షఫీఉల్లా, డీటీ గుండాల నాయక్, పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలి

ఆదోని టౌన్: కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లును ఏపీ సీఎం చంద్రబాబు, బీహార్ సీఎం నితీష్ కు మార్ పార్లమెంట్‌లో వ్యతిరేకించాలని ముస్లిం నాయకులు ఖలీపా ఖలీద్, ఖాజీ తాహెర్ జామియా మసీద్ ఖదీప్, జునైద్, నూర్ అహ్మద్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మైనార్టీలు వ్యతిరేకిస్తున్న బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టడం అన్యాయమన్నారు. సద్దాం హుస్సేన్, ఫయాజ్ బాష, అబూబాకర్ సిద్ధికి, నాసిర్ అహ్మద్, ఫారుక్ పాల్గొన్నారు.

వాగును కాపాడండి

వెల్దుర్తి టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న వాగును కబ్జా నుంచి కాపాడాలని ప్రజలు కోరారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్‌కు వినతి పత్రం అందజేశారు.



వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

సంక్షేమానికి టీడీపీ పెద్దపీట



మాట్లాడుతున్న వైకుంఠం శివప్రసాద్

ఆలూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రసాద్, వైకుంఠం జ్యోతి అన్నారు. సోమవారం జనసేన మీడియా కోఆర్డినేటర్ స్వగృహంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హామీలను విడతల వారీగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రతిపక్ష హోదా కూడా సాధించలేని మాజీ సీఎం జగన్ అసెంబ్లీలో ప్రజల పక్షాన మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలను చర్చించి పరిష్కారానికి కృషి చేయాల్సిన వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకపోవడం విచారకరమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తల్లికి వందనం పథకాన్ని అమలు చేసేందుకు శ్రీకారం చుటారన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడంతో డీఎస్సీకి మార్గం సుగుమమైందన్నారు. త్వరలోనే మంత్రి లోకేష్ నోటిఫికేషన్ విడుదల చేయబోతున్నారని, మీడియాలో పబ్లిసిటీ కోసం వైసీపీ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. జీవన్ కుమార్, కృష్ణ యాదవ్, కటారు కొండ సీనప్ప, గోవింద్, వెంకటరామప్ప చౌదరి, అరవింద్, చిత్రపతి పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆదోని టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అమరావతి నగర్ మెయిన్ రోడ్డు ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించాలని బీజేపీ నాయకులు మధుసూదన్ శర్మ, కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ కొందరు ఆక్రమించి బంకులు వేసుకోవడంతో కుదించుకుపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సౌత్‌జోన్ అధ్యక్షు డు మహబూబ్ బాషా, నబీరసూల్ పాల్గొన్నారు.

29 మంది గైర్హాజరు

ఆలూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 6 కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం గణితం పరీక్షకు 29 మంది గైర్హాజరైనట్లు ఎంఈవోలు కోమలదేవి, చిరంజీవి రెడ్డి తెలిపారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

ఆలూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెల్ల రేషన్ కార్డుదారులు ఈనెల 31లోగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ గోవింద్ సింగ్ సూచించారు. సోమవారం మాట్లాడుతూ కార్డులో పేర్లు ఉన్న వారంతా వేలి ముద్ర వేయాలన్నారు. లేకపోతే సంక్షేమ పథకాలకు అనర్హులవు తారన్నారు.

పరీక్షలను తనిఖీ చేసిన డీఈవో



మాట్లాడుతున్న డీఈవో శ్యామ్యూల్

హొళగుంద, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని డీఈవో శ్యామ్యూల్ తనిఖీ చేశారు. ఏ, బీ కేంద్రాల్లో 550 మంది విద్యార్థులకు గాను 541మంది పరీక్షలు హాజరయ్యారని 9 మంది గైహాజరు అయినట్లు తెలిపారు. ఎంఈవోలు సత్యనారాయణ, జగన్నాథం ఉన్నారు.

బీజేపీలో చేరిక

ఆదోని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న పెండేకల్ గ్రామానికి చెందిన వైసీపీ కుటుంబాలు బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి ఆద్వర్యంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పాటుపడాలని, సమస్య వస్తే సంప్రదించి పరిష్కారం చేసుకోవాలని అన్నారు. ఎన్నికలల్లో మాత్రమే రాజకీయాలని, అనంతరం ఒకే కుటుంబంలా ఐక్యమత్యంతో ఉండాలని పిలుపునిచ్చారు. బీజేపీలోకి చేరిన వారిలో రంగన్న, మల్లికార్జున, గిరిగెల రవి, వడ్డేరాజు, బసప్ప, గణేష్ రెడ్డి, అంజి, వెంకటేష్, గొల్ల జయరాముడు, చిన్న ఉరుకుందు, రాము, వెంకటేష్, రాముడు వీరా, రాజు, జగదీశ్ పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే పార్థసారథి

వాల్మీకి శాంత దీక్షకు మద్దతు



మాట్లాడుతున్న మారెళ్ల అంజి

ఆదోని టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వాల్మీకి సంఘం మద్దతు తెలిపింది. తనపై అవిశ్వాస తీర్మానానికి నిరసనగా చైర్‌పర్సన్ నిరసన దీక్ష సోమవారానికి 5వ రోజుకు చేరుకొంది. వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారెళ్ల అంజి అనుచరులతో సోమవారం దీక్షా శిబిరానికి చేరుకుని మద్దతు ప్రకటించారు. శాంతనే చైర్ పర్సన్‌గా కొనసాగించాలని, ఆమెకు న్యాయం జరగకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. మాజీ జడ్పీటీసీ రామ్ భీం నాయుడు, సాయికుమార్, తాయన్న, చంద్ర, మహేంద్ర పాల్గొన్నారు. ఆర్‌టీఐ యాక్ట్ సంఘం అధ్యక్షుడు హుసేనప్ప యాదవ్‌తో పాటు పద్మసాలె సంఘం నాయకులు మద్దతు తెలిపారు.

పేదలకు స్థలాలు ఇవ్వండి

వెల్దుర్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టీడీపీ నాయకులు ఈదుల వెంకటరాముడు, రాజశేఖర్ సోమవారం తహసీల్దార్ చంద్రశేఖరవర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో నిరుపేదలు ఇళ్లు నిర్మించుకుంటారని తెలిపారు. గుంటుపల్లె గ్రామంలో సర్వేనెంబరు 240-1ఏ, 240-బీ2, 240-సీ లో ఉన్న మిగులు భూమిలో పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దళిత నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జై భీమ్ సాయిరాం, ఉపాధ్యక్షుడు గుమ్మల బాలస్వామి కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ప్రహరీకి పెయింటింగ్ వేయించాలని, పండ్ల వ్యాపారాలను తొలగించాలని కోరారు. నరేష్ కుమార్, నకుల రాజు, లక్ష్మీకాంత్, మల్లికార్జున, రాముడు, వెంకట్ రాముడు, ఈరన్న వీరేష్ పాల్గొన్నారు.

క్షయను నిర్మూలిద్దాం

• ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల్లో ర్యాలీ నిర్వహించిన వైద్యాధికారులు

ఆదోని టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయను నిర్మూలిద్దామని, ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నట్లు ఐఎంఏ సభ్యులు డా.గోపినాథ్, డా.శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆదోనిలో ఐఎంఏ ఆధ్వర్యంలో ఆదిత్య నర్సింగ్ హోమ్‌లో క్షయపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీ కేవలం దగ్గు రావడం, దగ్గితే రక్తం పడటం మాత్రమే కాదని, శరీరంలోని ఏ భాగానికైనా సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రారంభంలోనే గుర్తించి తగిన పరీక్షలు చేయంచి, మందులు వాడితే పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు డా.కృష్ణమూర్తి, డా.ఆదిత్య కుమార్, డా వసుధ రాణి పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో

డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సత్యవతి, డా.శేఖన్ బాను అవగాహన కల్పించారు. డా.వందన్, డా.మనీషా, సిబ్బంది స్వరూప్, భాస్కర్, లలితమ్మ, సుబ్బమ్మ బాయి, వీరేష్, ఆశావర్కర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీబీ బాధితులకు పౌష్టికాహార కిట్లను దాతలు ఉపాధ్యాయులు నిరంజన్ కుమార్, ఫయాజుద్దీన్ ఆధ్వర్యంలో అందజేశారు.



ఆదోనిలో ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

సేవలకు గుర్తింపుగా అవార్డు

పట్టణంలోని ఏరియా ఆసుపత్రి టీబీ యూనిట్‌లో ఉత్తమ సేవలను అందించిన ఉద్యోగులకు అవార్డులు లభించాయి. సూపర్వైజర్ బాబురాజు, ల్యాబ్ టెక్నీషియన్ పద్మావతి కర్నూలులో టీబీ జిల్లా అధికారి డా. భాస్కర్ నుంచి అందుకొన్నారు.

క్షయ లేని గ్రామాలే లక్ష్యం

ఆదోని రూరల్: క్షయ లేని గ్రామాలే లక్ష్యంగా ముందుకె ళుతున్నట్లు డీఎంహెచ్‌వో సత్యవతి, వైద్యాధికారులు తెలిపారు. కర్నూలులో క్షయ రహిత గ్రామాల సర్పంచులు కోట పరమేష్ (నాగలాపురం), రోహిత ప్రియా (ఆరేకల్లు), మహారేఖ (బలదూరు) సన్మానించారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర: క్షయపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి తెలిపారు. సోమవారం ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు.

టీబీ రహిత పంచాయతీగా బొంతిరాళ్ల

క్రిష్ణగిరి: టీబీ రహిత గ్రామ పంచాయతీగా నిలిచిన బోయ బొంతిరాళ్ళ గ్రామ సర్పంచ్ రవిమోహన్‌కు వైద్యాధికారులు కర్నూలులో అవార్డు అందించారు. జిల్లా లీగల్ అథారిటీ చైర్మన్ లీలా వెంకట శేషాద్రి, డీఎంహెచ్‌వో, డీపీవో భాస్కర్, జిల్లా క్షయ నివారణ అధికారి మోక్షేశ్వరుడు మీదుగా అందుకున్నారు.



మద్దికెరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ రవి మోహన్

అదుపు తప్పితే కాలువలోకే..

● గాజులదిన్నె కుడి కాలువ గట్టుకు పొంచి ఉన్న ప్రమాదం

● కుంగుతున్న కాలువ గట్లు

గోనెగండ్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె కుడికాలువ కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. కాలువ గట్టు పైన పిల్లిగుండ్ల, నెరుడుప్పల, బండగట్టు, ఎర్రబాడు, ఒంటెడుదిన్నె గ్రామాలతో పాటు పత్తికొండకు కూడా ఇదే దారి వెంట ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే కాలువ గట్టు దెబ్బతినడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కాలువ ద్వారా ప్రతి రోజు 100 క్యూసెక్కుల నీరు ఆయకట్టు పొలాలకు వెళుతుంది. ఇటీవల వాహనాల రాక పోకల ఒత్తిడితో కాలువ గట్టు రెండు వైపుల కుంగి పోయాయి. అధికారులు స్పందించి కుడికాలువ నూతన కల్వర్టుతో పాటు రక్షణ గోడ కూడా నిర్మించాలని ప్రయాణికులు, చుట్టపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కుంగేందుకు సిద్ధంగా ఉన్న జీడీపీ కుడి కాలువ కల్వర్టు

న్యాయసుధలో ఎనిమిది మంది ఉత్తీర్ణులు

పట్టాలు అందజేసిన పీఠాధిపతి



పీఠాధిపతితో పట్టా అందుకున్న విద్యార్థులు

మంత్రాలయం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠంలో శ్రీమన్ న్యాయసుధ విద్యలో సోమవారం ఎనిమిది మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి శ్రీమఠానికి గుర్తింపు తెచ్చారు. 12 ఏళ్లగా కావ్య, నాటక, వ్యాకరణ, తర్క, న్యాయ, మీమాంస శాస్త్రాలు చదివి రెండేళ్లగా పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు, పండిత కేసరి విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్ దగ్గర శ్రీమన్ న్యాయసుధ విద్యను అభ్యసించారు. దాదాపు 20 మందిగా పీఠాధిపతులు, 300 మంది ప్రసిద్ధి పండితులు ఆధ్వర్యంలో మౌఖిక పరీక్షల్లో తమ పాండిత్యాన్ని నిరూపించారు. హ్రిషికేష్, పురిణిక్ బద్రినాథ్, అభిషేక్‌జోషి, శ్రీకరతంత్రి, పీఎస్ రాఘవేంద్ర, వదిసింహ, పావనాచార్య, ఫణిరాజ్ పురోహిత్ పండితులుగా గుర్తింపు పొందారు. వీరికి రాఘవేంద్రస్వామి మఠంలో శాశ్వత ఉద్యోగం, రూ. లక్ష నగదు, మెమెంటో, ప్రశంసపత్రం, శేషవస్త్రం అందజేశారు. స్థానిక పీఠాధిపతిని మంగళ మహోత్సవంలో పాల్గొన్న పీఠాధిపతులు అభినందించారు. న్యాయసుధ విద్యార్థులు పీఠాధిపతి, రాజాఎస్ గిరిరాజచార్‌లను ఘనంగా సత్కరించారు.

నేడు ఏకాదశి

మంత్రాలయం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం రాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతులు సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇస్తారు. నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకొనే అవకాశం మఠం అధికారులు కల్పించనున్నారు. నిత్యపూజలు బంద్ చేశారు.

మఠానికి వంద క్వింటాళ్ల బియ్యం విరాళం

మంత్రాలయం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి అనంతపురం జిల్లాకు చెందిన ఆప్కో రవి అనే భక్తుడు వంద క్వింటాళ్ల బియ్యం, బెంగళూరులు చెందిన వెంకటేషన్ అనే భక్తుడు రూ. 43 వేలు గోశాలకు విరాళంగా ఇచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. సోమవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, రవికులకర్ణి, నారాయణ రావు, గిరిధర్, నరసింహ దేశాయ్, శ్రీపాద ఆచార్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి ప్రాంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెన్షనర్లు ప్రజా సేవలో పాల్గొనడం ప్రశంసనీయమన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడం హర్షణీ యమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మున్ముందు ఎన్నో చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఏపీ వీరన్న, కార్యదర్శి శ్రీనివాసులు, సుందరబాయి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి: డీవైఎఫ్ఐ

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ భృతి రూ. మూడు వేలు వెంటనే ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక శివన్న నగర్‌లో పట్టణ అధ్యక్షుడు మహేష్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ ముందుగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరుల స్ఫూర్తితో యువత ఉద్యమించాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. పేపర్ ప్రకటనలకు కాకుండా నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవి, కిరణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

'హాస్టల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి'

గోనెగండ్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కోడుమూడు ఎస్సీ హాస్టల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. రెండురోజుల క్రితం హస్టల్ జరిగిన సంఘటన ఫోన్ చిత్రికరించి సోషల్ వీడియాలో వైరల్ కావడంతో పలు విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్య ధోరని పట్ల విమర్శలు గుప్పిస్తున్నారు. సిబ్బంది పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గోనెగండ్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిప్పనూరు గ్రామ సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. తిప్పనూరు దగ్గర ఉన్న హంద్రీనది నుంచి అధికారుల అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో కాపుకాచి ట్రాక్టర్‌ను పట్టుకొని, ట్రాక్టర్ యజమాని రఘువేంద్రతో పాటు మరో వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



పోలీసులు సీజ్ చేసి ఇసుక ట్రాక్టర్

వలసలు నివారించాలి

రెండో రోజూ కొనసాగిన దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న ఆర్డీఎస్ కుడికాలువ సాధన సమితి నాయకులు

ఎమ్మిగనూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణాన్ని వెంటనే చేపట్టి కర్నూలు జిల్లా పశ్చిమప్రాంతంలో వలసలు నివారించాలని ఆర్డీస్ కుడికాలువ సాధన సమితి నాయకులు సత్యనారాయణరెడ్డి, సీపీఐ రంగన్న, బీసీ బతకన్న, నీలకంఠ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ రెండో రోజూ సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో సాధనక మిటీ కన్వీనర్ టీచర్ నాగన్న ఆధ్వర్యంలో కమిటీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తుంగభద్ర నదిపై ఆర్డీఎస్ కుడికాలువ నిర్మించుకోవటానికి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ హక్కులు ఇచ్చిందన్నారు. అయితే పాలక ప్రభుత్వాలు నిధులు కేటాయించకుండా కర్నూలు జిల్లా పశ్చిమప్రాంతాన్ని శాశ్వతకరువు ప్రాంతంగా మార్చాయన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతి ఏడాది తుంగభద్రనదిలో 150టీఎంసీల జలాలు శ్రీశైలం జలాశయంలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాంతంలో అభివృద్ధి లేకుండా చేస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దీక్షలకు వైసీపీ నాయకులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ నజీర్, పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, నాయకులు శివకుమార్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఖాజా, కృష్ణ, వెంకటేశ్, సాంసోన్, స్వామిదాసు, వీరప్రతాప్, పుల్లన్న, ఉరుకుందు, నాగేష్, నరసన్న, లక్ష్మన్న, గడ్డం ఉసేని, ఎల్లప్ప, రైతులు చిన్నన్న, నతానియోలు, నరసింహులు, నాగరాజులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

గోనెగండ్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్యయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఆనంద్‌బాబు, కరుణాకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజాచైతన్యయాత్రలో భాగంగా గోనెగండ్లలోని ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 26న మండల కార్యాలయాల దగ్గర సమస్యలపై ఆందోళన కార్యక్రమాలను చేపట్టాలని సీపీఎం నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నబిరసూల్, మునెప్ప, బతకన్న, దేవదాసు, లింగన్న పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ నిరంజన్ రెడ్డి

పెద్దకడబూరు , మార్చి24(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నౌలేకల్ గ్రామంలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత వివరాలను అపరిచితవ్యక్తులతో పంచుకోరాదన్నారు. మద్యం తాగి వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమన్నారు. మహిళలపై దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

హామీలను అమలు చేయాలి: సీపీఐ

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసి నాయకులు రాజు, ప్రసాద్, యేసేబులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయలేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజా ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మద్దమ్మ, గుంటయ్య, ప్రమీళమ్మ, పద్మావతి, సుశీలమ్మ, దానమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై జాగ్రత్తలు అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

కోసిగి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపై జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని డాక్టర్ మౌనిక అన్నారు. జాతీయ క్షయ నిర్మూలన దినోత్సవంలో భాగంగా సోమవారం కోసిగి మేజర్ పంచాయతీ కార్యాలయం ముందు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ క్షయ ఒక అంటు వ్యాధి అని, రెండు వారాల నుంచి దగ్గు ఉంటే క్షయ కావచ్చని గళ్ల పరీక్ష చేయించుకుని డాట్స్ పద్ధతి ద్వారా మందులు తీసుకుంటే క్షయ పూర్తిగా నయమవుతుందన్నారు. కోసిగి మండలంలో 49 మంది క్షయవ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఈశ్వరమ్మ, ఎల్లప్ప, శ్రీనివాసులు, కోటేశ్వరమ్మ, జయమ్మ, రాముడు, ఉదయ్ కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డంపు యార్డు పరిశీలన



డంపు యార్డును పరిశీలస్తున్న మున్సిపల్ శాఖా మంత్రి ఓఎస్డీ ఖాజా హుసేన్

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోగనూరు రోడ్డులో ఉన్న డంపు యార్డును మున్సిపల్ శాఖ మంత్రి ఓఎస్డీ ఖాజాహుసేన్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. సీపీఐ ఆధ్వర్యంలో డంపుయార్డును తొలగించాలని ఆందోళన చేపట్టారు. ఇందుకు స్పందించిన మున్సిపల్ శాఖ మంత్రి ఓఎస్డీ ఖాజా హుసేన్ డంపుయార్డును పరిశీలించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ మదన్, విద్యుత్ ఏఈ ప్రసన్నాంజనేయులు, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న ఉన్నారు.

బాలుడి అదృశ్యం

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బాలుడు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్, సోగనూరు రోడ్డుకు చెందిన షెక్ మహ్మద్ సల్మాన్ పట్టణ శివారులోని మదర్సాలో చదువుకుంటున్నాడు. రంజాన్ సెలవులకు తల్లిదండ్రులు ఇంటికి తీసుకొని వెళ్లగా ఈ నెల 18న ఉదయం బయటికి వెళ్లిన బాలుడు ఇంటికి తిరిగి రాలేదు. దాంతో బాలుడి తండ్రి సర్దార్ అలీ బంధువుల ఇళ్ల వద్ద వెతికాడు. ఎక్కడ ఆచూకి లభ్యం కాకపోవడంతో సోమవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదకరంగా బోరు

పట్టించుకోని అధికారులు



జగనన్న కాలనీలో ఉన్న బోరు

ఎమ్మిగనూరు , మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ వెనుక వైపు ఉన్న జగనన్న కాలనీలో బోరు ప్రమాదకరంగా మారింది. జగన్న కాలనీలో అధికారులు నీటి సౌకర్యం కోసం బోరును వేయించారు. అయితే బోరులో నీరు రాకపోవడంతో బోరుకు మూత వేయకుండానే వదిలేశారు. వందల అడుగుల లోతు బోరు రంధ్రం వేసి అలాగే వదిలేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి బోరుకు మూత వేసి ప్రమాదాన్ని నివారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు

ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయింపు



రాఘవేంద్ర సర్కిల్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మంత్రాలయం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా నాయకుడు అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం మంత్రాలయంలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు ఊసే లేదన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జయరాజు, పెద్దకడుబూరు మండల కార్యదర్శి తిక్కన్న, సీపీఎం నాయకులు లక్ష్మన్న, అనిల్, ప్రాణేష్, అంజి, తిమ్మోతి, అంజనేయ, సురేష్, మారెప్ప, వీరేష్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

అధ్యక్ష, కార్యదర్శులుగా రషీదుల్లా, ఆనంద్



బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు

ఎమ్మిగనూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. సోమవారం కోర్టు ఆవరణంలో ఉన్న బార్ అసోసియేషన్ కార్యాల యంలో ఎన్నికల అధికారులు రంగనాథ్, కుమార లింగమూర్తి, రామమూర్తి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా రసీదుల్లా, ప్రధాన కార్యదర్శిగా ఎస్ ఆనందు, ఉపాధ్యక్షుడిగా నాగన్న, సహాయ కార్యదర్శిగా హిజ్కియా, లైబ్రేరీ సెక్రటరీగా కే ఎంకన్న, ట్రెజరర్ గా మురళీ కృష్ణ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా వీ రామకృష్ణ నామి నేషన్లు వేశారు. వీరికి పోటీగా ఎవరు నామినేషన్ వేయకపోవటంతో అధ్యక్ష, కార్యదర్శులు రసీదుల్లా, ఆనంద్‌తోపాటు సభ్యులు ఏకగ్రీవం గా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఎన్నికైన వారికి తోటి న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు నారాయణ, రఘురామ్, సాల్మాన్, రంగన్న పాల్గొన్నారు.

టీడీపీతోనే కోసిగి అభివృద్ధి

జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి



భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామం అభివృద్ధి చెందుతుందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే మండలంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువల పనులు చేశామని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి అన్నారు. సోమవారం కోసిగిలోని 4వ వార్డులో ఆంజనేయస్వామి (కోసిగయ్య) దేవాలయం వద్ద సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.10లక్షలతో భూమి పూజ చేశారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, వక్రాణి వెంకటేశ్, నాడిగేని అయ్యన్న, తోవి శ్రీనివాసులు, తోవి పుల్లయ్య, నాడిగేని చిన్నతాయన్న, ఈరయ్య, నరసన్న, గుండేష్, శివ, హనుమంతు, బసవ, దొడ్డయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న బీకేఎంయూ నాయకులు

నందవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నందవరం మండలంలోని ముగతి గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని (బీకేఎంయూ)ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయక కార్యదర్శి సోమేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. బీకేఎంయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి కోసం గుమ్మిని ఏర్పాటు చేసి కొలాయిలను ఏర్పాటు చేయకపోవడంతో నీరు వృథాగా పోతోందన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, తిప్పన్న, గోవర్ధన్, ఉరుకుందు, వీరారెడ్డి, లక్ష్మన్న పాల్గొన్నారు.

సమస్యలు తీరేదెన్నడో..!

● చాలీచాలని జీతాలతో తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు

● కనీస వేతనాలు అమలు చేయాలని విజ్ఞప్తి

కోసిగి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 102 తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలకు రూ. 7,870ల వేతనంతో పని చేస్తున్న డ్రైవర్లు, అరకొర జీతాలతో కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 102 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి కనీస వేతనం అమలులో భాగంగా రూ. 18,500లు వేతనం అమలు చేయాలని తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తోవి బసవరాజు, రాష్ట్రంలోని మంత్రులు నారా లోకేశ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతి పత్రం ఇచ్చామన్నారు. తొమ్మిదేళ్ల నుంచి జీతాలు పెంచకపోవడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితులు దయనీయంగా మారాయని, ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీరి ఉద్యోగ కాంట్రాక్టు మార్చి 31తేదీతో ముగిసిపోతుండటంతో ప్రభుత్వం ఆలోచించి తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేసి, ఉద్యోగభద్రత కల్పించాలని బసవరాజు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆరోగ్య శాఖ మంత్రికి వినతి పత్రం ఇస్తున్న 102 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు (ఫైల్)